
Follow: @ANNTELUGU
21-02-2025
ANN తెలుగు
మహా పత్రిక
శుక్రవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 81 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



# పీఏ కూతురు వివాహానికి హాజరైన సీఎం రేవంత్ రెడ్డి

**మహా:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పీఏ కూతురు వివాహానికి హాజరయ్యారు. రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్ మున్సిపాలిటీ మన్నెగూడలో బీఎంఆర్ సార్థ గార్డెన్స్‌లో గురువారం జరిగిన ఈ వివాహ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి కుటుంబ సమేతంగా హాజరయ్యారు. సీఎం పర్సనల్ అసిస్టెంట్ పురుషోత్తంరెడ్డి కూతురు వివాహానికి హాజరై నూతన వధూవరులను ముఖ్యమంత్రి దంపతులు ఆశీర్వదించారు. ఈ వివాహ వేడుకకు ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, బుయ్యని మనోహర్ రెడ్డి, చిలుక మధుసూదన్ రెడ్డి సహా పలువురు నాయకులు వివాహానికి హాజరయ్యారు.

### సీఎం మంచి మనసు

సీఎం రేవంత్ రెడ్డి తన మంచి మనసును చాటుకున్నారు. కండరాల వ్యాధితో బాధపడుతూ వైద్యం చేయించుకోలేకపోతున్న నిరుపేద యువకుడు గూళ్ల రాకేష్ గురించి తెలుసుకుని సీఎం రేవంత్ రెడ్డి

మిగతా 2లో

## టాప్ న్యూస్

### ఎస్సీ వర్గీకరణలో మోదీ, రేవంత్ పాత్ర లేదు

- సుప్రీం కోర్టు తీర్పు వల్ల వర్గీకరణకు బాటలు
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



02

### మీ ఇష్టానుసారం ప్రవర్తిస్తామంటే కుదరదు

- సెలవు దినాల్లో కూల్చివేతలు చట్టవిరుద్ధం
- హైడ్రాపై హైకోర్టు సీరియస్



02

### అల్లు అర్జున్‌కు అరుదైన గౌరవం

- హాలీవుడ్ మ్యాగజైన్ కవర్‌పై బన్నీ
- 'అల్లు అర్జున్: ది రూల్' పేరుతో రానున్న ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియా ఆర్టికల్



03



ఫామ్ హౌస్‌లో పెన్ను పేపర్‌తో

## గీస్తే గ్రాఫ్ పడిపోతుందా?

- కేసీఆర్ పగటి కలలు మానాలి
- పట్టభద్రుల ఎన్నికల నుండి పారిపోయారు
- పాలనను పరుగులు పెట్టించే రేవంత్‌కు కేసీఆర్‌కు పోలిక ఎక్కడ?
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

02

### 23న టీపీసీసీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం

హాజరుకానున్న మీనాక్షి నటరాజన్

వివరాలు 2లో



ఏపీ జలదోపిడీ

# కేసీఆర్ వైఫల్యమే

## జగన్‌తో దోస్తీ చేసి దోపిడీకి సహకరించారు

- కేసీఆర్ మౌనం వల్లే తెలంగాణకు తీరని అన్యాయం
- కాళేశ్వరం వల్ల మీ జేబులు నిండాయి కానీ..
- ప్రాజెక్టు వల్ల నీళ్ళు రాలేదు..హరీష్ ఏ పదవికీ అనర్హుడు
- సాగునీటి ప్రాజెక్టుల విషయంలో పూర్తిగా వైఫల్యం చెందారు
- ఇరిగేషన్ శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫైర్

**హైదరాబాద్, మహా:** కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌తో స్నేహంగా ఉంటూ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన జల దోపిడీకి సహకరించారని రాష్ట్ర ఇరిగేషన్ శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. గురువారం జలసౌధలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆనాడు ఏపీ ప్రభుత్వం చేసిన జల దోపిడీకి కేసీఆర్ ప్రభుత్వం సహకరించిందని అన్నారు.

మిగతా 2లో

### ఉత్తమ్ ఫిర్యాదుతో కదిలిన కేఆర్ఎంబీ

నేడు కీలక సమావేశం

ఏపీ ప్రభుత్వం కృష్ణా జలాలను అక్రమంగా తరలిస్తోందని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కృష్ణానదీ యాజమాన్య బోర్డుకి ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో కేఆర్ఎంబీ ఛైర్మన్ అతుల్ జైన్ అధ్యక్షతన శుక్రవారం మధ్యాహ్నం బోర్డు సమావేశం కానుంది. శ్రీశైలం, నాగార్జునసాగర్ నుంచి నీటిని ఏపీ అక్రమంగా తరలిస్తోందని, వెంటనే అడ్డుకోవాలని మంత్రి ఉత్తమ్ ఫిర్యాదులో పేర్కొన్నారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల పరిధిలో 35 చోట్ల టెలిమెట్రీ పరికరాలు ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వం కోరుతోంది.

### ఏపీ జలదోపిడీ అడ్డుకోవాలి

నీళ్ల మంత్రి నిర్లక్ష్యం

మాజీమంత్రి హరీష్ రావు ఆరోపణలు

వివరాలు 2లో

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే

## గోపినాథ్‌కు సీరియస్

### ఆస్పత్రికి తరలింపు

ఆరోగ్యస్థితిపై కేటీఆర్ ఆరా.. ప్రజల్లో ఆందోళన



**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయనను కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. గోపినాథ్ కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నారు. దీని కారణంగా ఆయన నాలుగు రోజుల క్రితం తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. సమస్య ఎక్కువ కావడంతో కుటుంబసభ్యులు ఆయనను వెంటనే ఆసుపత్రికి తరలించారు. గత కొంతకాలంగా ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. కిడ్నీలు దెబ్బతిన్నాయి. అయినప్పటికీ నియోజకవర్గ పనుల్లో నిత్యం తలమునకలవుతున్నారు. ఇటీవల సమస్య మరింత జఠిలం కావడంతో ఆయన ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. నాలుగు రోజుల క్రితం ఆరోగ్యం మరింత క్షీణించింది. దీంతో ఆయనను నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యాన్ని వైద్యుల బృందం పర్యవేక్షిస్తోంది.

మిగతా 2లో

లింగమూర్తి హత్యపై

## సీఎం రేవంత్ రెడ్డి సీరియస్

సీఐడీ విచారణకు ఆదేశించే అవకాశం

కేసీఆర్, హరీష్‌లపై కేసువేసిన లింగమూర్తి



వివరాలు 2లో



## హిమాలయాలకు పోతావా..

### పవన్‌పై మోదీ వేసిన జోక్ ఇదీ

**మహా:** ఢిల్లీ సీఎం ప్రమాణ స్వీకారానికి కాషాయ దుస్తుల్లోనే పవన్ హాజరవడం అందరి దృష్టిని ఆకర్షించింది. ప్రమాణ స్వీకార కార్యక్రమం వేదికపైకి వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ అక్కడ ఆశీనులైన ఎన్డీఏ కూటమి నేతలతో ముచ్చటిస్తూ అందరినీ పలకరించారు. ఈ క్రమంలో ఆయన పవన్ కళ్యాణ్ దగ్గర ఆగి, ఆయన ధారణలో ఉన్న కాషాయ వస్త్రాలను గమనించి సరదాగా వ్యాఖ్యలు చేశారు. మోదీ నవ్వుతూ "కొంపదీసి రాజకీయాలు వదిలేసి హిమాలయాలకు వెళ్లిపోతావా? ఏంటి?" అని వ్యాఖ్యానించారు. దీంతో పవన్ కూడా నవ్వుతూ స్పందించారు. అనంతరం మోదీ "అందుకు ఇంకా చాలా టైమ్ ఉంది.. నువ్వు చేయాల్సిన పని చెయ్యి" అంటూ పవన్‌ను మోడీ ప్రోత్సహించారట. ఈ ఆసక్తికరమైన సంఘటనను పవన్ కళ్యాణ్ విలేకరుల సమావేశంలో మీడియాతో పంచుకున్నారు. "ప్రధాని మోదీగారు సరదాగా నాకు కాషాయ దుస్తుల గురించి మాట్లాడారు. అది నిజంగా ఒక మంచి జోక్. రాజకీయాల్లో ఇంకా చాలా చేయాల్సిన పనులున్నాయి," అని పవన్ వ్యాఖ్యానించారు.

వివరాలు 7లో



ఇందిరమ్మ ఇండ్లకు

# నేడు శ్రీకారం

### 72,045 ఇందిరమ్మ ఇండ్లకు శంఖుస్థాపన

నారాయణపేట మండలం అప్పకపల్లెలో ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మహా**: ఇందిరమ్మ ఇండ్ల పథకానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లాంఛనంగా శ్రీకారం చుట్టనున్నారు. మొదటి విడుతలో మంజూరు చేసిన 72,045 ఇండిరమ్మ ఇండ్ల నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. నారాయణపేట జిల్లా నారాయణపేట మండలము, అప్పకపల్లె లో రాష్ట్ర ముఖ్యమంత్రి పథకం ప్రారంభించనున్నారు. ఇల్లు లేని కుటుంబాలందరికీ ఇండ్లు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించగా, లబ్దిదారులు స్వంతంగా ఇల్లు కట్టుకునే అవకాశం కల్పించింది. ఇంటికి రు.5 లక్షల పూర్తి సుబ్సిడితో ఆర్థిక సహాయం అందించనుంది.

మిగతా 2లో

## హరీశ్ మానవత్వముందా?

హత్యా రాజకీయాలు చేయడమేనా

### మీ గ్రాఫ్ కేసీఆర్?

- రాజలింగమూర్తి హత్యపై మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యలు
- లగచర్లలో కలెక్టర్ ను చంపాలని చూశారు
- హరీష్ అవినీతి మీద పోరాడుతున్న చక్రధర్ కు కూడా రక్షణ కల్పిస్తాం
- గతంలో వామన్ రావును చంపేశారు

03



సీబీఐ విచారణకైనా

## సిద్ధమే

మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యలపై మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణ రెడ్డి

భూపాలపల్లిలో జరిగిన హత్యను ఖండిస్తున్నాం



వివరాలు 2లో

ఢిల్లీ సీఎంగా రేఖా గుప్తా

# ప్రమాణ స్వీకారం

### హాజరైన మోదీ, అమిత్ షా, చంద్రబాబు

**ఢిల్లీ, మహా:** దేశ రాజధాన్ని ఢిల్లీ ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా ప్రమాణ స్వీకారం చేశారు. ఢిల్లీ రామ్ లీలా మైదానంలో రేఖా గుప్తాతో లెఫ్టినెంట్ గవర్నర్ ప్రమాణం చేయించారు. డిప్యూటీ సీఎంగా పర్వేశ్ వర్మ ప్రమాణ స్వీకారం చేయగా.. ఆయనతోపాటు మరో ఐదుగురు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యేలు ఆశిష్ సూద్,

మిగతా 2లో





## ఫామ్ హౌస్‌లో పెన్ను పేపర్‌తో గీస్తే గ్రాఫ్ పడిపోతుందా?

- కేసీఆర్ పగటికలలు మానాలి
- పట్టభద్రుల ఎన్నికల నుండి పారిపోయారు
- పాలనను పరుగులు పెట్టించే రేవంత్ కు కేసీఆర్ కు పోలిక ఎక్కడ?
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

**నిజామాబాద్, మహా:** మాజీ సీఎం కేసీఆర్ కు పగటి కలలు కనడం అలవాటుగా మారిందని,. ఆయన పర్మినెంట్ గా రెస్ట్ తీసుకుంటే ఆరోగ్యానికి మంచిదని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. కేసీఆర్‌ను తెలంగాణ ప్రజలు మళ్ళీ ఆదరించరన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఫామ్ హౌస్‌లో పడుకునే కేసీఆర్‌కు, పాలనను పరుగులు పెట్టించే రేవంత్ రెడ్డికి పోలికా? రాజకీయాల్లో కేసీఆర్ శకం ముగిసింది అని ఆయన అన్నారు. పట్టభద్రుల ఎన్నికల్లో అభ్యర్థిని నిలబెట్టే సత్తా లేని బీఆర్ఎస్ మళ్ళీ అధికారంలోకి వస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఫామ్ హౌస్‌లో పెన్ను పేపర్‌తో గీస్తే గ్రాఫ్ పడిపోతుందా? ప్రశ్నలు రైజ్ చేశారు. రాష్ట్రంలో 56 శాతం బీసీలు మా వెంట ఉంటే గ్రాఫ్ ఎలా పడిపోతుందన్నారు. ఏడాదిలో 56 వేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు. ఇకనైనా కేసీఆర్, బీఆర్ఎస్ పగటి కలలు మానుకోవాలని హితవు పలికారు.

# మీ ఇష్టానుసారం ప్రవర్తిస్తామంటే కుదరదు

## సెలవు దినాల్లో కూల్చివేతలు చట్టవిరుద్ధం.. హైడ్రాపై హైకోర్టు సీరియస్

**హైదరాబాద్, మహా:** మహానగరంలో విపత్తుల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ ప్రొటెక్షన్(హైడ్రా) పై తెలంగాణ హైకోర్టు మరోసారి తీవ్ర స్థాయిలో అసహనం వ్యక్తం చేసింది. ఇష్టానుసారం కూల్చివేతలు చేపడతారా? అంటూ మండిపడింది. ఈ క్రమంలో తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. హైడ్రా కూల్చివేతల వ్యవహారంపై దాఖలైన పిటిషన్‌పై గురువారం విచారణ సందర్భంగా జస్టిస్ కే.లక్ష్మణ్ తీవ్రంగా స్పందించారు. "మీ ఇష్టం వచ్చినట్లు కూల్చివేతలు చేపడతారా? సెలవు దినాల్లో కూల్చివేతలు చట్టవిరుద్ధమని చెప్పినా నిబంధనలు పాటించరా? న్యాయస్థానం ఆదేశాలంటే లెక్కలేకుండా వ్యవహరిస్తే.. అది తెలిసేలా చేస్తాం అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. గత విచారణ సందర్భంగా ఇచ్చిన ఆదేశాలతో హైకోర్టుకు హాజరైన హైడ్రా ఇన్స్‌పెక్టర్ రాజశేఖర్ పైనా ధర్మాసనం మండిపడింది. పోలీస్ శాఖను నుంచి డిప్యూటేషన్‌పై వచ్చినంత మాత్రాన అక్కడ వ్యవహరించినట్లు ఇక్కడ ఉంటామంటే కుదరదు అని మందలించారు. మరోసారి ఇలాగే జరిగితే మీపై చర్యలకు డీజీపీకి ఆదేశాలు ఇవ్వాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆక్రమణల స్వాధీనానికి, అక్రమ భవనాల కూల్చివేతకు మేం వ్యతిరేకం



కాదన్న జస్టిస్ కే లక్ష్మణ్.. ఏది చేసిన చట్టపరంగా ఉండాలని సూచించారు. అలాగని ఇష్టం వచ్చినట్లు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. అనంతరం విచారణను వాయిదా వేశారు.

# హరీశ్ రావు మానవత్వముందా?

## హత్యా రాజకీయాలు చేయడమేనా మీ గ్రాఫ్ కేసీఆర్?

రాజలింగమూర్తి హత్యపై మంత్రి కోమటిరెడ్డి సంచలన వ్యాఖ్యలు

లగచర్లలో కలెక్టర్ ను చంపాలని చూశారు


హరీష్ అవినీతి మీద పోరాడుతున్న చక్రధర్ కు కూడా కూడా రక్షణ కల్పిస్తాం

గతంలో వామన్ రావును చంపేశారు

**హైదరాబాద్, మహా:** హరీశ్ రావు నీవు మనిషివేనా? నీకు మానవత్వం ఉందా అంటూ రాజలింగమూర్తి హత్యపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరంలో కేసీఆర్ కు శిక్ష పడుతుందని కేటిఆర్ ఆదేశాలతోనే మాజీ ఎమ్మెల్యే గండ్రావెంకటరమణారెడ్డి నా భర్తను హత్య చేయించాడని రామలింగమూర్తి భార్య, కూతురు ఆరోపిస్తుంటే గండ్ర వెంకటరమణారెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేసి పోలీసులకు లొంగిపోమని చెప్పకుండా హరీశ్ రావు ప్రెస్ మీట్ పెట్టి కృష్ణా వాటర్ అంటూ డైవర్ట్ చేస్తున్నారని మండిపడ్డారు. హరీశ్ రావు నీవు మనిషివేనా? నీకు మానవత్వం ఉందా అని మండిపడ్డారు. గురువారం గాంధీ భవన్ లో మీడియాతో మాట్లాడిన కోమటిరెడ్డి.. రాజలింగమూర్తి హత్యను ప్రభుత్వం సీరియస్ గా తీసుకోవాలని కోరుతున్నానని హత్యలో కేసీఆర్ , కేటీఆర్, హరీష్ రావు, గండ్ర వెంకటరమణ రెడ్డి పాత్ర ఉందని ఆరోపించారు. సీబీ సీఐడీ విచారణ చేసి 24 గంటల్లోనే నిందితులను అరెస్ట్ చేయాలని ఫాస్ట్ ట్రాక్ కోర్ట్ ఏర్పాటు చేసి వెంటనే శిక్ష వేయాలన్నారు. హత్యను సీఎం రేవంత్ రెడ్డి కూడా సీరియస్ గా తీసుకుంటారని చెప్పారు.

**ఎదురుతిరిగితే చంపేస్తారా?**

లగచర్లలో కూడా కలెక్టర్ ను చంపాలని చూశారు. తెలంగాణను దోచుకొని తిని ఎదురు తిరిగిన వాళ్ళను చంపేస్తారా? పాపం తగిలి పోతరు.. తెలంగాణలో హత్య రాజకీయాలకు తావు లేదు అవినీతి మీద పోరాడే వారికి రక్షణ



కల్పిస్తాం. హరీష్ రావు అవినీతి మీద పోరాడుతున్న చక్రధర్ కూడా రక్షణ కల్పిస్తామన్నారు. బీఆర్ఎస్ పదేళ్లలో హత్యా రాజకీయాన్ని పెంచి పోషించిందని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ దోపిడీని ప్రశ్నించిన రాజలింగాన్ని హత్య చేశారని రాజలింగమూర్తి హత్యను తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. అడ్వకేట్ వామన రావు దంపతుల హత్యకు ఎవరు కరణమో అందరికీ తెలుసు, వరంగల్ లో ఎంపీడీఓ ను హత్య బీఆర్ఎస్ వాళ్ళు చేశారని అప్పటి సీపీ రంగనాథ్ చెప్పారు. కేసీఆర్ కాంగ్రెస్ గ్రాఫ్ తగ్గిందని అంటుండు.. హత్య రాజకీయాలు చేయడమేనా మీ గ్రాఫ్ కేసీఆర్? అని ప్రశ్నించారు. కేసీఆర్ కిరాయి హత్యలు చేయించడమే తప్ప కేసీఆర్ తో ఏమి కాదని దుయ్యబట్టారు. 15నెలల నుండి పామ్ హౌస్ నుండి ఎప్పుడైనా బయటకి వచ్చిండా? అని నిలదీశారు. సమావేశంలో ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, జి.మధుసూధన్ రెడ్డి పాల్గొన్నారు.



# ఏపీ జలదోపిడీ అడ్డుకోవాలి

## నీళ్ల మంత్రి నిర్లక్ష్యం

**మాజీమంత్రి హరీష్ రావు ఆరోపణలు**

**హైదరాబాద్, మహా :** కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి ఆంధ్రప్రదేశ్ చేస్తున్న జల దోపిడీని అడ్డుకోవాలి అని మాజీ మంత్రి హరీశ్‌రావు కోరారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని, తాము కూడా కలిసి వస్తాం.. ఢిల్లీకి పోదాం. ధర్నా చేద్దాం.. పదండి అని హరీశ్‌రావు పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో గురువారం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర సాగు, తాగు నీటి ప్రయోజనాలకు తీవ్ర నష్టం జరుగుతుంటే రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. సోయి లేని ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ఎంత నష్టం జరుగుతుందో అర్థం అవుతోంది. నీళ్ల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నీళ్లు నములుతున్నారు. బీఆర్ఎస్ తెలంగాణ భూములకు నీరు పారిస్తే... కాంగ్రెస్ నిర్లక్ష్యంగా ఉంది. సాగర్ కుడి కాల్వ నుంచి రోజూ పది వేల క్యూసెక్కులు మూడు నెలలుగా పోతున్నా పట్టించుకోవడం లేదు. తాత్కాలిక వాటా అయినా 512 టీఎంసీలకు మించి 657 టీఎంసీలు తీసుకుపోయింది. 25 రోజుల్లోనే 65 టీఎంసీల నీటిని తరలించారు. తెలంగాణ నీటి ప్రయోజనాలు కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టవా? ప్రభుత్వ నిర్లక్ష్యం తెలంగాణకు పెనుశాపంగా మారింది అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

# లింగమూర్తి హత్యపై సీఎం రేవంత్ రెడ్డి సీరియస్

## సీఐడీ విచారణకు ఆదేశించే అవకాశం

కేసీఆర్, హరీష్ లపై కేసువేసిన లింగమూర్తి



**మహా:** భూపాలపల్లి జిల్లా కేంద్రంలో బుధవారం హత్యకు గురైన మాజీ కౌన్సిలర్ భర్త రాజలింగమూర్తి హత్య కేసులో పోలీసులు కీలక పురోగతిని సాధించారు. ప్రాథమిక దర్యాప్తులో భూవివాదమే హత్యకు ప్రధాన కారణంగా భావిస్తున్నారు. ఈ కేసులో రేణికుంట్ల కొంరయ్య, రేణికుంట్ల సంజీవ్ లతో రాజలింగమూర్తికి భూ వివాదం ఉన్నట్టు తెలుస్తోంది. ఈ ఘటనలో భాగంగా పోలీసులు రేణికుంట్ల సంజీవ్, అతని బావమరిది శీమంత్ ను అదుపులోకి తీసుకున్నారు. ఈ హత్య కేసులో మరో ఇద్దరు నిందితులు మోరె కుమార్, కొత్తూరి కుమార్ పరారీలో ఉన్నారని పోలీసులు పేర్కొన్నారు. పోలీసులు వీరి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. రాజలింగమూర్తి గతంలో తహసిల్దార్ చక్రధర్, రేంజ్ ఆఫీసర్, ఒక వీఆర్ఓను ఏసీబీకి పట్టించడంతో అతనిపై కక్ష పెంచుకున్నవారు ఉన్నారు. 171 సర్వే నెంబర్‌లోని అటవీ శాఖ భూమిలో రాజలింగమూర్తి జోక్యం చేసుకోవడం వివాదాస్పదమైంది. ఇటీవల స్థానిక పోలీస్ స్టేషన్ ముందు ఉన్న భూమి విషయంలో రేణిగుంట కుటుంబంతో రాజలింగమూర్తికి తగాదాలు జరిగాయి. గత 15 రోజులుగా భూమి వివాదంపై గొడవలు జరుగుతుండగా, రేణిగుంట కుటుంబ సభ్యులు డీఎస్పీకి ఫిర్యాదు చేసినట్టు సమాచారం. రాజలింగమూర్తి హత్య కేసును ప్రభుత్వం సీరియస్ గా తీసుకుని విచారణను వేగవంతం చేసింది. పరారీలో ఉన్న నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది.

### హత్యకు కారణం ఏంటి?

భూపాలపల్లిలో జరిగిన లింగమూర్తి హత్యపై సీఎం రేవంత్ రెడ్డి సీరియస్ అయ్యారు. ఈ ఘటనపై సిఐడి విచారణకు ఆదేశించేందుకు అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనకు సంబంధించి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రెస్ మీట్ నిర్వహించారు. గత ప్రభుత్వం నిర్మించిన మేడిగడ్డ ప్రాజెక్టులో అక్రమాలపై గతంలో లింగమూర్తి కోర్టులో పిటిషన్ వేశారు. ఈ విషయంలో కోర్టు మాజీ సీఎం కేసీఆర్, హరీష్ లకు అప్పట్లో నోటీసులు జారీ చేసింది. ఈ హత్య కేసు వెనుక మరిన్ని రాజకీయ, భూవివాదాల కోణాలు ఉన్నాయా? మరెవరెవరు దీనిలో ప్రమేయం ఉన్నారు? అనేది దర్యాప్తులో తేలనుంది.

# జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే గోపినాథ్‌కు సీరియస్



(మొదటిపేజీ తరువాయి)

అన్ని రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు. కాగా గోపినాథ్ ఆరోగ్య పరిస్థితపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వారి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆయన కోరారు. మరోవైపు ఆయన ఆరోగ్య పరిస్థితిపై నియోజకవర్గంలో ప్రజల్లో ఆందోళన మొదలైంది. ఎప్పుడు యాక్టివ్ గా ఉండే గోపినాథ్ అస్వస్థతకు గరయ్యాడని తెలిసిన వెంటనే పలువురు నియోజకవర్గ నాయకులు ఆయనను పరామర్శించడానికి ఆసుపత్రి వద్ద క్యూ కట్టారు. కార్పొరేటర్లు, స్థానిక నాయకులు ఆయన కుటుంబ సభ్యులను అడిగి ఆరోగ్యపరిస్థితిపై ఆరాతీస్తున్నారు.

**హ్యాట్రిక్ విక్టరీ**

మాగంటి గోపినాథ్ ఇప్పటివరకు మూడుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. తొలిసారి 2014 అసెంబ్లీ ఎన్నికల్లో మాగంటి గోపినాథ్ టీడీపీ టికెట్ పై గెలుపొందారు. ఆ తర్వాత రాష్ట్ర విభజన నేపథ్యంలో చంద్రబాబు ఏపిని ప్రాధాన్యంగా ఎంచుకోవడంతో ఆయన బీఆర్ఎస్ లో చేరారు. నాటి నుంచి ఆయన ఆ పార్టీలోనే కొనసాగుతోన్నారు. 2019 ఎన్నికల్లో సైతం జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం నుంచి బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలుపొందాడు. ఈసారి 2023 ఏడాది చివరిలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం నుంచి మూడోసారి మాగంటి గోపినాథ్ విజయం సాధించారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందో ఊడుతుందో

## ఐఏఎస్ లను తప్పు చేయాలని ముఖ్యమంత్రే అంటారా?

మంత్రుల్లో, కాంగ్రెస్ ఎమ్మెల్యేల మధ్య చీలిక వచ్చింది

ముస్లింలను తొలగించి బీసీ జాబితా పంపితే కేంద్రాన్ని ఒప్పించే బాధ్యత మాదే

కాంగ్రెస్ అంటేనే బాకీల సర్కార్.. 3 ఎమ్మెల్సీ స్థానాల్లో బీజేపీదే గెలుపు

ఉద్యోగులు, నిరుద్యోగుల పక్షాన నిరంతరం కొట్లాడి జైలుకు వెళ్లింది బీజేపీ కార్యకర్తలే

బీఆర్ఎస్ పనైపోయింది.. కాంగ్రెస్ తో కుమ్మక్కై బీజేపీని ఓడించాలని బీఆర్ఎస్ చూస్తోంది

మేధావులారా.... కాంగ్రెస్ ను ఓడించండి... బీజేపిని గెలిపించండి.. కేంద్ర మంత్రి బండి సంజయ్

**మహా:** రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్న తీరును చూస్తుంటే ప్రభుత్వం ఉంటుందో ఊడుతుందో కూడా తెలియని పరిస్థితి నెలకొందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న రేవంత్ రెడ్డి ఒక్క తప్పు చేయాలని అంటే ఐఏఎస్ లు మూడు తప్పులు చేస్తున్నారని వ్యాఖ్యానించడం సిగ్గు చేటన్నారు. సీఎంగా ఉంటూ అవినీతిని, తప్పులను నిరోధించాల్సింది పోయి తప్పులు చేయాలని చెప్పడమేంటని ప్రశ్నించారు. ముఖ్యమంత్రే అవినీతి, తప్పులు జరుగుతున్నాయని ఒప్పుకున్నట్లయిందన్నారు. రాష్ట్రంలో మంత్రుల మధ్య, కాంగ్రెస్ ఎమ్మెల్యేల మధ్య చీలిక వచ్చిందన్నారు. కొందరు మంత్రులు సొంత దుకాణాలు ఓపెన్ చేసి ప్రతి పనికి 15 శాతం చొప్పున కమీషన్లు దండుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రతి నిరుద్యోగికి రూ.56 వేల నిరుద్యోగ భృతి, ప్రతి మహిళకు స్కూటీ, తులం బంగారం, ప్రతి ఉద్యోగికి పీఆర్సీ, 4 డీఏలు, రైతులకు రైతు భరోసా, బోనస్, రుణమాఫీ బాకీ పడిందని అన్నారు. కాంగ్రెస్ అంటేనే బాకీల సర్కార్ అని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా బాకీల కాంగ్రెస్ సర్కార్ ను బండకేసి బాదాలని ప్రజలకు పిలుపునిచ్చారు. టీచర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఈరోజు మధ్యాహ్నం కరీంనగర్ లోని కొండా సత్య లక్ష్మీ గార్డెన్ లో ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి నిజామాబాద్, ఉమ్మడి మెదక్ జిల్లాల్లోని బీజేపీ మండలాధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తోపాటు ఎంపీలు రఘునందన్ రావు, జి.నగేశ్, ఎమ్మెల్యేలు కాటేపల్లి వెంకటరమణారెడ్డి, పాయల శంకర్, పాల్వాయి హరీష్ బాబు మాజీ ఎమ్మెల్యేలు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, చింతల రామచంద్రారెడ్డి, బొడిగె శోభ, జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, మాజీ మేయర్లు సునీల్ రావు, డి.శంకర్ తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు బీజేపీ కొత్త మండలాధ్యక్షులుగా నియమితులైన తరువాత తొలిసారిగా ఎదురవుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో మీ దమ్ము చూపించండి. పీపుల్స్ పల్స్ సహా అనేక సర్వే సంస్థలు ఈసారి ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ గెలుస్తుందని స్పష్టం చేస్తున్నాయి. కాంగ్రెస్ కు అభ్యర్థులు దొరకక బయటనుండి అద్దెకు అభ్యర్థులను తెచ్చుకున్నాయి. బీఆర్ఎస్ అసలు పోటీలోనే లేదు. ఈసారి 3 ఎమ్మెల్సీ స్థానాల్లో బీజేపీ గెలవడం తథ్యం. ఎన్నికల ఫలితాల తరువాత నుండి మళ్లీ అధికారంలోకి వచ్చే దాకా రాష్ట్రంలో బీజేపీయే ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషించబోతోంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు అడిగే హక్కు ఒక్క బీజేపీకే ఉంది. నిరుద్యోగులు, టీచర్లు, ఉద్యోగుల పక్షాన నిరంతరం కొట్లాడి జైలుకు పోయింది మేమే. 317 జీవోపై దీక్ష చేస్తే నా ఆఫీస్ గేటును గ్యాస్ కట్టర్లతో కట్ చేయించి టియర్ గ్యాస్ వదిలి అద్దాలు పగలకొట్టి లాఠీఛార్జ్ చేయించారు. అద్దాలు కాలికి గుచ్చుకుని రక్తమోడుతున్నా కనికరం లేకుండా బరబరా గుంజుకుపోయి జైలుకు పంపారు. ఉద్యోగుల పీఆర్సీ, టీఏ, డీఏల కోసం, ప్రతినెలా జీతాలివ్వాలని కొట్లాడి ఫాంహౌజ్ లో పడుకున్న కేసీఆర్ ను ఇందిరా పార్క్ కు గుంజుకొచ్చిన చరిత్ర బీజేపీదే. గ్రూప్ 1 అభ్యర్థుల పక్షాన కొట్లాడింది బీజేపీయే. కాంగ్రెస్ ఎన్నడైనా కొట్లాడిందా? ఆ పార్టీ నాయకులు టీచర్లు, నిరుద్యోగుల కోసం ఎన్నడైనా జైలుకు వెళ్లారా? ఆనాడు తపస్ మినహా ఏ ఉపాధ్యాయ సంఘమైనా టీచర్లకు అండగా నిలిచాయా? ఉద్యోగులు, నిరుద్యోగులు, ప్రజల పక్షాన పోరాడినందుకు ఇయాళ బీజేపీలో ఒక్కో కార్యకర్తపై 10కిపైగా కేసులు నమోదయ్యాయని, రౌడీషీట్లు మేధావులారా...ఆలోచించండికాంగ్రెస్ అంటేనే బాకీల సర్కార్. ప్రతి నిరుద్యోగికి రూ.56 వేల భృతి బాకీ పడ్డరు. ప్రతి టీచర్, ఉద్యోగికి 4 డీఏలు, పీఆర్సీ బాకీ పడ్డరు. ప్రతి మహిళకు తులం బంగారం, స్కూటీ బాకీ పడ్డరు. రైతులకు రుణమాఫీ, బోనస్, రైతు భరోసా పైసలు బాకీ పడ్డరు. ప్రతి ఉద్యోగికి సరెండర్ లీవ్ ఎన్ క్యాష్ మెంట్ పైసలు బాకీ...ఎటు చూసినా బాకీ...బాకీ...బాకీ... ఇది బాకీల ప్రభుత్వం... ఈ బాకీల కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బండకేసి బాదండి... మోదీ ప్రభుత్వం మాట ఇస్తే తప్పదు. 10 లక్షల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని మాట ఇచ్చి ఏ చిన్న పొరపాటు లేకుండా నయాపైసా అవినీతి లేకుండా



ఇప్పటికే 9 లక్షల 25 వేల ఉద్యోగాలను భర్తీ చేసి అపాయిట్ మెంట్ లెటర్లు ఇచ్చిన ఘనత బీజేపీదే. ఉద్యోగులందరికీ 12 లక్షల 75 వేల రూపాయల వరకు పన్ను మినహాయింపు ఇచ్చిన ఘనత మోదీ సర్కార్ దే. ఇయాళ పేపర్ల చూసిన. "సివిల్ సర్వెంట్ల పనితీరు బాగోలేదు. ఒక్క తప్పు చేయాలని చెబితే... 3 తప్పులు చేస్తున్నారు. ఏసీ రూంలను వదిలి బయటకు రావడం లేదు"అని సీఎం మాట్లాడుతున్నడు.... ముఖ్యమంత్రి పదవిలో ఉంటూ మీరే ఒక్క తప్పు చేయాలని అంటే... వాళ్లు 3 తప్పులు చేయకుండా ఎట్లా ఉంటారు? ముఖ్యమంత్రే తప్పులు చేస్తున్నట్లు ఒప్పుకున్నడు. అసలు తప్పే జరగకుండా చూడాల్సిన మీరే తప్పు చేయాలని అంటే ఏ సందేశం పంపుతున్నట్లు? సీఎం వ్యాఖ్యలు చూస్తుంటే... ఈ ప్రభుత్వం ఎప్పుడుంటుందో, ఎప్పుడు ఊడుతుందో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య చీలిక వచ్చింది. కొందరు మంత్రులైతే ప్రతి పనికి 15 శాతం కమీషన్ వసూలు చేస్తున్నారన్నారు. కులగణన పేరుతో కాంగ్రెస్ పార్టీ కొరివితో తలగొక్కొంటోంది. బీసీ జాబితాలో ముస్లింలను చేర్చి బిల్లు పంపితే కేంద్రం ఎట్లా ఆమోదిస్తుంది? మేమేమైనా ఎడ్డోళ్లమా? ముస్లింలను బీసీల్లో ఎట్లా కలుపుతారు? మేం మొలదారం కట్టుకుంటాం. మాకు గోత్రం ఉంటది. వాళ్లతో మాకు పోలికేంది? ముస్లింలను బీసీ జాబితా నుండి తీసివేస్తే ఆ బిల్లును ఆమోదింపజేసే బాధ్యత మేం తీసుకుంటాం. లేకుంటే ఆమోదించే ప్రసక్తేలేదు. ముస్లింలను బీసీల్లో కలిపి అన్యాయం చేస్తున్నారు. కొందరు క్రైస్తవులు ఎస్సీ సర్టిఫికేట్లు తీసుకుంటూ ఎస్సీలకు నష్టం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా బీసీ, ఎస్సీ సంఘాలేం చేస్తున్నాయి? ఎందుకు స్పందించడం లేదు? ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి కొమ్ముకాయడమే మీ పనా? ఒక వర్గానికి కొమ్ముకాయాలని హిందూ సమాజానికి తీరని నష్టం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల్లో మేధావులంతా గుణపాఠం చెప్పాలని కోరారు.



# 23న టీపీసీసీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం

## హాజరుకానున్న మీనాక్షి నటరాజన్

**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ గాంధీ భవన్‌లో ఈనెల 23న తెలంగాణ ప్రదేశ్ కమిటీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం జరగనుంది. ఈ భేటికి టీపీసీసీ చీఫ్ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షత వహించనున్నారు. సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్‌గా నూతనంగా నియమితులైన మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఏఐసీసీ కార్యదర్శులు, ముఖ్య అతిథులుగా పాల్గొననున్నారు. అదేవిధంగా ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు, పీఏసీ, పీఈసీ సభ్యులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, అనుబంధ సంఘాల చైర్మన్లు, కార్పొరేషన్ ఛైర్మన్‌లు, నియోజకవర్గాల్లో పోటీ చేసిన అభ్యర్థులు, అధికార ప్రతినిధులు భేటీలో పాల్గొంటారు. ప్రస్తుతం జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికలు, సంస్థాగత నిర్మాణం, పార్టీ ప్రభుత్వం మధ్య సమన్వయం వంటి అంశాలపై చర్చ జరగనుంది.

# ఎస్సీ వర్గీకరణలో మోదీ, రేవంత్ రెడ్డి పాత్ర లేదు

## సుప్రీం కోర్టు తీర్పు వల్ల వర్గీకరణకు బాటలు

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్, మహా:** రేవంత్ రెడ్డి అంబేద్కర్ ను ఆయన వారసులను అవమానిస్తున్నాడని, అందుకే 125 అడుగుల అంబేద్కర్ విగ్రహానికి పూలదండ వేయలేదని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. అంబేద్కర్ జయంతిలోపు 125 అడుగుల అంబేద్కర్ విగ్రహానికి కేబినెట్ మొత్తం వెళ్లి పూలదండలు వేయాలని లేదంటే ప్రభుత్వం మూసివేసిన గేట్లను బద్దలుకొట్టి మేమే అంబేద్కర్ ను గౌరవించుకుంటామని కవిత అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నివాసంలో దళిత బంధు సాధన సమితి సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ కవిత మాట్లాడారు.

**ఎస్సీ వర్గీకరణ పేరుతో మరో మోసం**

ఎస్సీ వర్గీకరణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాత్ర ఏమీ లేదని కవిత అన్నారు. . వర్గీకరణ విషయంలో ప్రధాని మోదీ, సీఎం రేవంత్ రెడ్డి చేసిందేమీ లేదు. సుప్రీం కోర్టు తీర్పు వల్ల వర్గీకరణకు బాటలు పడ్డాయన్నారు. షమీమ్ అక్తర్ కమిషన్ నివేదికను బయటపెట్టి.. వెంటనే వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు. దళితుల మధ్య పంచాయతీ పెట్టవద్దు... ఎవరికీ అన్యాయం జరగకుండా వర్గీకరణ ఉండాలన్నారు.



ఎస్సీ వర్గీకరణ పేరు చెప్పి సీఎం రేవంత్ రెడ్డి మరో మోసం చేశారన్నారు. వర్గీకరణకు, ఉద్యోగాల కల్పనకు ముఖ్యమంత్రి లింక్ పెడుతున్నారు. వర్గీకరణ వంకతో జాబు క్యాలెండర్ అమలును నిలిపివేయవద్దన్నారు. కోర్టు తీర్పు వచ్చి 6 నెలలు గడిచినా ఆలూలేదు చూలు లేదన్నట్లుగా ఉంది. రేవంత్ రెడ్డి మాటలు చెబితే నమ్మరని ఢిల్లీ నుంచి ప్రియాంకాగాంధీని తీసుకొచ్చి హామీ ఇప్పించారని కవిత అన్నారు.

# సీబీఐ విచారణకైనా సిద్ధమే

## మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యలపై మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణ రెడ్డి

భూపాలపల్లిలో జరిగిన హత్యను ఖండిస్తున్నాం

**హైదరాబాద్, మహా:** భూపాలపల్లి హత్య కేసుపై బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణ రెడ్డి స్పందించారు. నిన్న భూపాలపల్లిలో జరిగిన హత్యను తాము ఖండిస్తున్నామని ఆయన అన్నారు. ఈ కేసును వివాదాస్పదం చేయాలని కొందరు ఉద్దేశ్యపూర్వకంగా ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ కేసు వెనుక భూవివాదమే ప్రధాన కారణమని అందరూ చెబుతున్నారని, హత్య చేసిన వారు కూడా అంగీకరించారని తెలిసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి చేసిన వ్యాఖ్యలపై గండ్ర వెంకట రమణ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి మాటలు చూస్తే బాధాకరంగా ఉందని, ఆయన మాటలు కేసుపై ప్రభావం చూపే విధంగా ఉన్నాయని అన్నారు. ఈ కేసుకు సంబంధించి అన్ని వివరాలు పోలీసుల వద్ద ఉన్నాయని.. కానీ కేసీఆర్, హరీష్ రావు, తనని అనవసరంగా ఆరోపిస్తున్నా



రని గండ్ర అన్నారు. అలాగే, మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డికి ఎవరినైనా నిర్ధారణ లేకుండా ఆరోపించడం అలవాటుగా మారిందని విమర్శించారు. హత్య కేసును అసలు విషయాన్నుంచి మళ్లించడానికి కుట్ర జరుగుతోందని.. మృతుడి భార్యతో ఇతర వ్యక్తులు కావాలని మాట్లాడిస్తున్నారని అన్నారు. మా మీద ఆధారంలేని ఆరోపణలు చేస్తున్నారని గండ్ర వెంకట రమణ రెడ్డి పేర్కొన్నారు. ఈ కేసుపై తాము విచారణకు ఎలాంటి అభ్యంతరం చెప్పమని, నిజానిజాలు బయటపడాలంటే సీబీఐ విచారణకైనా సిద్ధమేనని స్పష్టం చేశారు.

# ఢిల్లీ సీఎంగా రేఖా గుప్తా ప్రమాణ స్వీకారం

(మొదటిపేజీ తరువాయి)

మంజిన్దెర్ సింగ్ సిర్సా, రవీంద్ర రాజ్, కపిల్ మిశ్రా, పంకజ్ సింగ్ మంత్రులుగా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతోపాటు కేంద్రమంత్రులు, 20 రాష్ట్రాల సీఎంలు, డిప్యూటీ సీఎంలు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హాజరయ్యారు. మరోవైపు సినీ, పారిశ్రామిక రంగాల పలువురు ప్రముఖులు సైతం విచ్చేశారు. 27 ఏళ్ల తర్వాత ఢిల్లీలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన నేపథ్యంలో బీజేపీ కార్యకర్తలు, నేతలు సంబరాల్లో మునిగితేలుతున్నారు.


# 25న హైదరాబాద్‌లో బయోఆసియా-2025 సదస్సు

## రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

### హాజరుకానున్న లైఫ్ సైన్సెస్, ఫార్మా రంగాల నిపుణులు



**హైదరాబాద్, మహా:** హెల్త్ టెక్, ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాల్లో తెలంగాణను ప్రపంచంలో అగ్రగామిగా నిలిపేందుకు ఈ నెల 25, 26వ తేదీల్లో 'బయో ఆసియా 2025' సదస్సును హైదరాబాద్ లోని హెచ్ఐసీసీలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గురువారం తెలిపారు. ఈ ఏడాది ఏఐ ఆధారిత ఆరోగ్య సంరక్షణ పరివర్తన, లైఫ్ సైన్సెస్‌లో ఆవిష్కరణలు, డేటా ఇంటర్ ఆపరేబిలిటీ, క్లినికల్ ట్రయల్స్‌లో భారత్ పాత్ర తదితర అంశాలపై ప్రధానంగా దృష్టి సారించామన్నారు. ఈ వేదిక ద్వారా జీవవైద్య, ఫార్మా రంగాలకు చెందిన జాతీయ, అంతర్జాతీయ నిపుణులు, ఆవిష్కర్తలను ఒకే చోటు చేర్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. దేశీయ, విదేశీ మార్కెట్లలో లైఫ్ సైన్సెస్ రంగంలో ఉన్న అవకాశాలు, సవాళ్లను ఈ సదస్సులో ప్రత్యేకంగా చర్చిస్తామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి పీయూష్ గోయల్, క్వీన్స్‌ల్యాండ్ గవర్నర్ డాక్టర్ జెన్నెట్ యంగ్, జీ 20 షెర్పా అమితాబ్ కాంత్, అమ్జెన్ ఛైర్మన్, సీఈవో రాబర్ట్ ఎ. బ్రాడ్‌వే, జీనోమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సింగపూర్ ఈడీ ప్రొ. పాట్రిక్ టాన్, మెడ్‌ట్రానిక్ సీటీవో డా. కెన్ వాషింగ్టన్, మిల్టెని బయోటెక్ ఎండీ డా. బోరిస్ తదితరులు పాల్గొంటారన్నారు. ఈ నెల 25న జరుగబోయే సీఈవో కాన్ క్లేవ్ లో ఇస్రో మాజీ చైర్మన్ డాక్టర్ ఎస్. సోమనాథ్, డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ ఛైర్మన్ సతీష్ రెడ్డి, భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఛైర్మన్ , ఎండీ డా. కృష్ణ ఎల్లా, లారస్ ల్యాబ్స్ సీఈవో డా.సత్యనారాయణ చావా, నోవార్టిస్ అప్మా ప్రాంతం చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ సీజర్ కాన్సెప్షన్, లిల్లీ ఇండియా అధ్యక్షుడు, జీఎం విన్సెల్ టక్కర్ తదితరులు పాల్గొంటారని వివరించారు



# అల్లు అర్జున్‌కు అరుదైన గౌరవం

## హాలీవుడ్ మ్యాగజైన్ కవర్‌పై బన్నీ

### 'అల్లు అర్జున్: ది రూల్' పేరుతో రానున్న ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియా ఆర్టికల్

**మహా:** ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఇటీవల 'పుష్ప 2'తో భారీ విజయం దక్కించుకున్నారు. ఈ సినిమాతో ఆయన ప్రపంచస్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ క్రమంలో బన్నీ తాజాగా మరో అరుదైన ఘనత సాధించారు. ప్రతిష్ఠాత్మక సినిమా మ్యాగజైన్ 'ది హాలీవుడ్ రిపోర్టర్' ఇప్పుడు 'ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియా' పేరుతో భారత్‌లోనూ అడుగుపెట్టేసింది. ఈ మ్యాగజైన్ తొలి సంచిక అల్లు అర్జున్ ఫొటోతో రానుంది. ఈ క్రమంలోనే కవర్ పేజ్ను తాజాగా రివీల్ చేశారు. అలాగే దీనికి సంబంధించిన ఫొటో షూట్ నిర్వహించారు. ఆ ప్రోమో బిహైండ్ సీన్స్ వీడియోను తాజాగా షేర్ చేశారు. ఇక 'అల్లు అర్జున్: ది రూల్' పేరుతో ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియాలో ఈ ఆర్టికల్ రానుంది.



# ఇందిరమ్మ ఇండ్లకు నేడు శ్రీకారం

## 72,045 ఇందిరమ్మ ఇండ్లకు శంఖుస్థాపన

### నారాయణపేట మండలం అప్పకపల్లెలో ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

బేస్మెంట్ కట్టగానే రూ.లక్ష లబ్దిదారుని ఖాతాకి నేరుగా విడుదల కానుంది. ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. ఈ పథకంపై ప్రజలు చాలా కాలంగా ఎదురుచూస్తున్నారు.

**నేడు రెండు జిల్లాలకు సీఎం**

వికారాబాద్, నారాయణ పేట జిల్లాల్లో శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించనున్నారు. పలు అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి పాల్గొంటారు. మధ్నాహ్నం 12 గంటలకు ముఖ్యమంత్రి వికారాబాద్ జిల్లా దుద్యాల్ మండలం పోలేపల్లి గ్రామానికి చేరుకుంటారు. పోలేపల్లి లో రేణుకా ఎల్లమ్మ తల్లి ఆలయంలో జరిగే పూజా కార్యక్రమంలో పాల్గొంటారు. ఆ తర్వాత నారాయణ పేట మండలం అప్పక్ పల్లి చేరుకుంటారు. అక్కడ జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పెట్రోల్ బంక్‌ను ప్రారంభిస్తారు. బీపీసీఎల్ కంపెనీ సహకారంతో పూర్తిగా మహిళలచే నడిపే పెట్రోల్ బంక్ ఇది. రాష్ట్రంలోనే మొదటి సారి ఈ తరహా బంక్ ను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. అనంతరం అప్పక్ పల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. నారాయణ పేట మెడికల్ కాలేజీ లో అకడమిక్ బ్లాక్ తో పాటు, ఇతర భవనాల నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు గురుకుల హాస్టల్ ఆవరణలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు.

# పకడ్బందీగా ప్రచార వ్యూహం

## 50 మంది ఓటర్లకో ఇన్‌ఛార్జి

### జూమ్ మీటింగ్ లో సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు

### టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జూమ్ మీటింగ్



**హైదరాబాద్, మహా:** ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార వ్యూహాన్ని పకడ్బందీగా రచించుకోవాలని, ఎట్టిసరి స్థితుల్లోనూ ఈ స్థానంలో కాంగ్రెస్ పార్టీ గెలవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నియోజకవర్గ ఇన్ ఛార్జిలకు సూచించారు. టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన జూమ్ మీటింగ్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్... మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క, జూపల్లి కృష్ణారావు, కొండ సురేఖ, ఎమ్మెల్సీ ఎన్నికల పరిధిలో 42 అసెంబ్లీ నియోజక వర్గాల బాద్యులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇంచార్జ్ లు, యూత్ కాంగ్రెస్, ఎన్ ఎస్ యుఐ, మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ పకడ్బందీగా ప్రచార వ్యూహం రచించాలని, 50 మంది ఓటర్లకు ఒక ఇంచార్జ్ని బాధ్యుడిగా పెట్టాలన్నారు. యూత్ కాంగ్రెస్, ఎన్ ఎస్ యుఐ నాయకులు గ్రామ స్థాయి నుంచి వ్యూహాలు రచించాలని, ఓటర్లకు మన మీద మంచి అభిప్రాయం ఉన్న కూడా వాళ్ళను ఓటు వేయించేలా బాధ్యత తీసుకోవాలన్నారు. మనం చేసిన అభివృద్ధి, సంక్షేమ పనులకు విస్తారంగా ప్రచారం చేయాలని, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇంఛార్జీలు పూర్తి స్థాయిలో ఎన్నికల వ్యూహంతో పని చేయాలన్నారు. మొదటి, రెండో ప్రాధాన్యత ఓటులను కూడా ప్రాధాన్యతగా తీసుకోవాలని, ఎలిమినెట్ సిస్టమ్ లో ఓట్ల లెక్కింపు ఉన్నందున ప్రతి ఓటును చాలా ముఖ్యంగాతీసుకోవాలన్నారు. ఓటర్ మ్యాపింగ్, ఓటర్లను ప్రత్యేకంగా కలవడం, వాళ్ళను గ్రామ స్థాయి నుంచి బూత్ కు తీసుకళ్లడం లాంటి అంశాలు చాలా కీలకమని, ఎక్కడ నిర్లక్ష్యం ఉండకూడదని, గాంధీ భవన్ నుంచి కంట్రోల్ రూమ్ పెట్టి నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ ఈ ఎమ్మెల్సీ ఎన్నిక చాలా కీలకమైనదని, ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. మన సిట్టింగ్ ఎమ్మెల్సీ సీటు, రాష్ట్రంలో అధికారంలో ఉన్నాం. ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాము. ఇవన్నీ యువకుల్లో బాగా ప్రచారంలోకి తీసుకెళ్లి విజయం సాధించేలా చేయాలన్నారు.



# మీడియా అకాడమీ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం

**హైదరాబాద్, మహా:** తెలంగాణ మీడియా అకాడమీ తొలి గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం గురువారం హైదరాబాద్ నాంపల్లిలోని చాపెల్ రోడ్‌లోని మీడియా అకాడమీ భవనంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో కె. శ్రీనివాస రెడ్డి అధ్యక్షతన జరిగింది. వర్కింగ్ జర్నలిస్టులకు శిక్షణ తరగతులు నిర్వహించడం, వర్కింగ్ జర్నలిస్ట్స్ వెల్ఫేర్ ఫండ్ కింద మరణించిన వర్కింగ్ జర్నలిస్టులకు ఆర్థిక సహాయం అందించడం వంటి కీలక నిర్ణయాలు తీసుకోవడంతో పాటు, ప్రభుత్వ సహకారంతో ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ న్యూస్‌పేపర్స్ ఆర్కైవ్స్ ను కొనసాగించాలని పాలక మండలి ఏకగ్రీవంగా నిర్ణయించింది. ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి కె. ధర్మయ్య, ఐ అండ్ పిఆర్ శాఖ జాయింట్ డైరెక్టర్ డి.ఎస్. జగన్, డాక్టర్ సతీష్ కుమార్ తల్లాడి, డాక్టర్ యాదగిరి కంభంపాటి, హైదరాబాద్‌లోని డోర్ దర్శన్ కేంద్రం ప్రోగ్రామ్ ఇన్‌చార్జ్ పి.వి. సత్యనారాయణ, ఆల్ ఇండియా రేడియో ప్రోగ్రామ్స్ హెడ్ ఎస్. రమేష్ సుంకసారి, తెలంగాణ మీడియా అకాడమీ కార్యదర్శి ఎన్.వెంకటేశ్వరరావు ఈ సమావేశానికి హాజరయ్యారు. హైదరాబాద్‌లోని చాకలి ఇలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలోని జర్నలిజం విభాగాధిపతి బి.వి. కృష్ణాజీరావు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు.

# బీజేపీ అంటే అక్షింతలు.. అబద్దాలే



## మంత్రి సీతక్క సెటైర్లు

**మంచిర్యాల, మహా:** బిజెపికి అభివృద్ధి పట్టదని, అక్షింతలు, అబద్ధాలు మాత్రమే ప్రచారం చేస్తున్నారని మంత్రి సీతక్క విమర్శించారు. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్ , మెదక్ జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డికి మద్దతుగా గురువారం మంచిర్యాల జిల్లాలో ప్రచారం నిర్వహించారు. బిజెపి కి అభివృద్ధి పట్టదు, అక్షింతలు, అబద్ధాలు మాత్రమే ప్రచారం చేస్తున్నారని, అటు కేంద్రంలో కుల మత విద్వేషాలు రెచ్చగొట్టడం తప్ప యువతకు ఉపాధి, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాలు భర్తీ చేయడం లేదన్నారు. వాస్తవాలు గ్రహించి పటబద్రులు మొదటి ప్రాధాన్య ఓటు నరేందర్ రెడ్డికి వేయాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ తో మాత్రమే అభివృద్ధి, సంక్షేమం రెండు జోడెద్దుల బండిలా పరిపాలన సాగుతుందన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే వెడ్మబొజ్జు, అభ్యర్థి నరేందర్ రెడ్డి నేతలు పాల్గొన్నారు.

## మరోసారి కాళేశ్వరం విచారణ

# కమిషన్ గడువు పొడిగింపు

**హైదరాబాద్, మహా:** కాళేశ్వరం బ్యారేజీలపై విచారణకు నియమించిన కమిషన్ గడువును మరో రెండు నెలలు పొడిగించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ అవకతవకలపై విచారణ నిర్వహిస్తున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ గడువును మరో 2 నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఏప్రిల్ 30వ తేదీ వరకు కమిషన్ గడువును పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

# పీఏ కూతురు వివాహానికి హాజరైన సీఎం రేవంత్ రెడ్డి



(మొదటిపేజీ తరువాయి)

చలించిపోయారు. తక్షణమే రాకేష్‌కు కావాల్సిన వైద్య సాయం అందించాలని అధికారులను ఆదేశించారు. ఉచితంగా వైద్యం అందించడంతో పాటు రాకేష్ కోసం ఛార్జింగ్ వాహనాన్ని కూడా అందించాలని ముఖ్యమంత్రి సూచించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు రాకేష్ కుటుంబీకులతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రభుత్వం నుంచి అన్ని రకాలుగా ఆదుకుంటామని సీఎం తరఫున హామీ ఇచ్చారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం రంగయ్య పల్లి గ్రామానికి చెందిన గూళ్ల రాకేష్ చాలా కాలం సూడో మస్క్యులర్ డిస్ట్రోఫీ అనే కండరాల వ్యాధితో బాధపడుతున్నాడు.

# నాంపల్లి కోర్టుకు హాజరైన సీఎం

**హైదరాబాద్, మహా:** నాంపల్లి ప్రజా ప్రతినిధుల స్పెషల్ కోర్ట్ ముందు సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఎన్నికల సమయంలో ఎన్నికల కమిషన్ ఉల్లంఘన కేసులో సీఎం రేవంత్ రెడ్డి మనోరంజన్ కాంప్లెక్స్ లోని ప్రజా ప్రతినిధుల స్పెషల్ కోర్టు కు హాజరయ్యారు. ఎలక్షన్ ప్రచార సమయంలో నలగొండ జిల్లాలో మాజీ సీఎం కేసీఆర్ పై చేసిన వాఖ్యలతో పాటు పలు కేసులు నమోదయ్యాయి. ఓయూ సిటీ ,మెదక్ కౌడి పల్లి, బేగంబజార్, తిరుమల గిరి, పెద్దవూర, కమలపూర్, నల్గొండ మొత్తం 9 కేసులు నమోదు కాగా, మూడు పోలీస్ స్టేషన్ లో నమోదైన కేసులో ముఖ్యమంత్రి హాజరయ్యారు.

# రాష్ట్రంలో ఐఏఎస్‌ల బదిలీలు

## 8 మందికి స్థానచలనం

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో 8మంది ఐఎఎస్‌లను బదిలీచేస్తూ ప్రభుత్వం గురువారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. ఆర్ వి కర్ణన్ ను అదనంగా ఆరోగ్యశ్రీ బాధ్యతలు అప్పగించగా, సురేంద్రమోహన్ కు సహకార శాఖ బాధ్యతలు, హాకా ఎండి చంద్రశేఖర్ రెడ్డికి అదనంగా ఫుడ్స్ బాధ్యతలు, కె. హరితను ఆర్థిక శాఖ నుండి వాణిజ్యపన్నుల శాఖకు బదిలీచేశారు. ఉద్యానశాఖ డైరెక్టర్ యాషీన్ బాషాకు సీడ్స్ బాధ్యతలు అప్పగించారు. వనపర్తి అడిషనల్ కలెక్టర్ ను నారాయణపేటకు బదిలీచేశారు.

# మిస్సింగ్ హౌస్ హోల్డ్ సర్వే షురూ

## కులగణనలో కీలకం

**హైదరాబాద్, మహా:** సామాజిక ఆర్థిక విద్య ఉద్యోగ రాజకీయ కుల గణన సర్వేలో మిగిలిపోయిన ఇంటింటి సర్వేకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ నెల 16వ తేదీ నుంచి..ఇప్పటి వరకు మొత్తం 4625 కుటుంబాలు సర్వేలో తమ వివరాల నమోదు చేసుకున్నాయని ప్రభుత్వవర్గాలు వెల్లడించాయి

- ఇప్పటివరకు టోల్ ఫ్రీ నెంబర్ 0402111111కు వచ్చిన మొత్తం కాల్స్: 6,415
- ప్రజా పాలన సేవా కేంద్రాల్లో నమోదు చేసుకున్న సర్వే ఫారాలు: 4,227
- వెబ్ సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకున్న సర్వే ఫారాలు: 398
- ఎన్యుమరేషన్ పూర్తయిన గృహాలు: 2,254
- డేటా ఎంట్రీ పూర్తయిన సర్వే ఫారాలు: 1,091

# ఆస్పత్రిలో చేరిన సోనియాగాంధీ



**ఢిల్లీ, మహా:** కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ ఢిల్లీలోని గంగారాం ఆసుపత్రిలో గురువారం చేరారు. డాక్టర్ల పర్యవేక్షణలో ఉన్న ఆమె ఆరోగ్యంగా ఉందని, శుక్రవారం డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉందని సమాచారం. 2024 డిసెంబర్‌లో సోనియా గాంధీకి 78 ఏళ్లు నిండిపోయాయి.

# పట్టభద్రుల ఎన్నికలలో ఖచ్చితంగా విజయం సాధిస్తాం

## కాంగ్రెస్ కార్యకర్తలు దీనిని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి.. నరేందర్ రెడ్డి గెలుపు.. కాంగ్రెస్ పార్టీ గెలుపు



**కరీంనగర్, మహా:** పట్టభద్రుల ఎన్నికల్లో ఖచ్చితంగా విజయం సాధిస్తామని, కాంగ్రెస్ నాయకత్వం పటిష్ఠంగా ఉందని, ఐదేండ్లు అద్భుత పరిపాలన సాగిస్తామని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. గురువారం ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డికి మద్దతుగా ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన శాసనసభ ఎన్నికల లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కృషి వలన ఎనిమిది స్థానాలు గెలుచుకున్నామని, పదేండ్లలో ఎన్ని కష్టాలు పెట్టిన కాంగ్రెస్ తోనే క్యాడర్ ఉన్నారన్నారు. ఏ అభ్యర్థికి పట్టభద్రుల సమస్యలపై అవగాహన ఉందో చూడాలని, చైతన్య,నారాయణ విద్యాసంస్థలకి ధీటుగా అల్ఫోర్స్ కళాశాల నిఏర్పాటు చేసి నాణ్యమైన విద్యను నరేందర్ రెడ్డి అందిస్తున్నారన్నారు. నరేందర్ రెడ్డి పై బిజెపి నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని, ఇది నరేందర్ రెడ్డి ఎన్నిక కాదు అని కాంగ్రెస్ పార్టీ ఎన్నిక అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత అత్యధిక ఉద్యోగాలు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిందన్నారు. యాభై ఆరు వేల ఉద్యోగాలు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిందన్నారు. 317 జీవో బిఅర్ఎస్ తీసుకువస్తే బిజెపి మద్దతు తెలిపిందని, కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే 317 జీవో ద్వారా అన్యాయం జరిగిన వారికి వెసులుబాటు కల్పించామన్నారు. 317 జీవో గురించి మాట్లాడే హక్కు బండిసంజయ్ కి లేదన్నారు. స్కిల్ యూనివర్సిటీ ద్వారా నిరుద్యోగుల కి ఉద్యోగ కల్పన చేస్తామన్నారు.

**బీజేపీకి బిఆర్ఎస్ మద్దతు**

బిఅర్ఎస్ ప్రత్యక్షంగా, పరోక్షంగా బిజేపి కి సపోర్ట్ చేస్తుందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రదాన ప్రతిపక్షం బిఅర్ఎస్. మేము బిఅర్ఎస్ తో ఎలా నడుస్తాం. గత ప్రభుత్వం చేసిన తప్పులు,లోపాలు ఖచ్చితంగా ఎత్తిచూపుతాం. బిజేపి, బిఅర్ఎస్ లు కలిసి నడుస్తున్నారు. హత్య రాజకీయాలని క్షమించేది లేదు. భూపాలపల్లి హత్య విషయం లో ప్రభుత్వం సిరియస్ గా ఉంది...ఖచ్చితంగా తప్పు చేసినవారికి శిక్ష పడుతుంది. బిఅర్ఎస్ ఎన్ని ప్రయత్నాలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏం కాదు. పది సంవత్సరాల లో జరిగిన అవినీతిని పకడ్బందీగా బయటికి తీస్తున్నాం. కమిషన్ ప్రభుత్వం ప్రమేయం లేకుండా వాళ్ళ పని వారు చేసుకుంటున్నారు. వామన్ రావు దంపతుల హత్యకేసు సుప్రీంకోర్టు లో విచారణ జరుగుతుంది. బిఅర్ఎస్ వారు భ్రమలో ఉన్నారు. మా నాయకత్వం పటిష్ఠంగా ఉంది...మాకు ఏంకాదు. మా గ్రాఫ్ ఎక్కడ పడిపోలేదు. ఐదేండ్లు మా ప్రభుత్వం కి ఢోకాలేదు. పట్టభద్రుల ఎన్నికలలో ఖచ్చితంగా విజయం సాధిస్తామని మంత్రి ధీమా వ్యక్తం చేశారు.

EDITORIAL సంపాదకీయం

# లీగల్లీ బీసీ... ఎమోషనల్లీ ఓసీ
## పీఎం మోడీ!



**బీజేపీకి బీసీ కుల గణన చేయడం అసలు ఏమాత్రం ఇష్టం లేదు. ఎందుకంటే సీఎం రేవంత్ రెడ్డి చెప్పినట్టు... నరేంద్ర మోడీ లీగల్లీ బీసీ కావొచ్చు...ఎమోషనల్లీ ఓసీ అన్నది అక్షరసత్యం. తెలంగాణ ప్రభుత్వం ఎన్నో రోజులు తీవ్రంగా శ్రమించి సర్వేను విజయవంతం చేసింది. తెలంగాణను ఆదర్శంగా తీసుకొని దేశవ్యాప్తంగా కులగణనను చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ రాష్ట్ర శాసనసభ, శాసనమండలి తీర్మానాలు చేయడం దేశంలోని ఇతర రాష్ట్రాలకు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఒక బలమైన విజ్ఞప్తి ఇచ్చింది. స్వతంత్ర భారతంలో కులగణన చేపట్టిన రాష్ట్రంగా తెలంగాణ చరిత్రలో నిలిచిపోయింది.**

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి... మోడీ పుట్టుకతో బీసీ కాదని చేసిన ఇటీవల చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశం అయ్యాయి. ప్రధాని మోడీ పుట్టుకతో బీసీ కాదని... ఈ దేశంలోని చట్టాలు, వాటిలో ఉన్న లొసుగులను ఉపయోగించుకొని ఆయన లీగల్లీ బీసీగా కన్వర్టెడ్ అయ్యారని వ్యాఖ్యానించారు. అది నిజమే కదా. ఆయన వ్యాఖ్యానంలో ఏమాత్రం సత్యదూరమైన అంశాలు లేవు. ప్రధాని మోడీ కులంపైన సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపైన బీజేపీ నాయకులు ఎందుకు నానా హైరానా పడుతున్నారో అర్థం కావడం లేదు. తొలుత మోడీ బీసీ కాదని... ఆ తర్వాతనే ఆయన కులాన్ని బీసీ ల్లో చేర్చారని మరి కొంతమంది బీజేపీ నాయకులే అంగీకరిస్తున్నప్పుడు కేంద్ర హోంశాఖ మంత్రి బండి సంజయ్ ఎందుకు దానిపై రాద్ధాంతం చేస్తున్నారు. ఆయనకు ఎందుకంత ఉలికిపాటు? ఇంత కాలం మోడీకి బీసీ ముసుగు వేసి ప్రచారం చేసుకున్నారు బీజేపీ నేతలు. ఆ ముసుగుతో బీసీల ఓట్లను కొల్లగొట్టారు. ఆ ముసుగును రేవంత్ రెడ్డి తీయడంతో బీజేపీకి దిక్కు తోచని పరిస్థితి నెలకొంది. ఆయన లీగల్లీ కన్వర్టెడ్ అని మాట్లాడింది రేవంత్ రెడ్డి మాత్రమే కాదు... జాతీయ రాజకీయాల్లో ఈ చర్చ చాలా కాలంగా ఉన్నది. ఇంతకుముందు ఇదే అంశంపై యూపీ మాజీ సీఎం కుమారి మాయవతి కూడా మాట్లాడారు. మోడీ పుట్టుకతో బీసీ కాదని నొక్కి చెప్పారు 2019 ఎన్నికల సందర్భంలో. అప్పుడు ఆమెపై బీజేపీ నేతలు అంతా ఒంటి కాలి మీద లేచారు. ఇదంతా చర్చ ఎందుకు వస్తుందంటే... ఉదాహరణకు ఏదైనా కులాన్ని మరేదైనా కులంలో కలపాలి అంటే సమగ్రంగా అధ్యయనం చేయాలి. అందుకోసం స్వతంత్రంగా వ్యవహరించే నిపుణుల బృందంతో ఒక కమిటీని వేయాలి. ఆ నిపుణుల కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా...సిఫార్సులపై నిర్ణయం తీసుకుంటారు. కానీ, బీజేపీకి బీసీ కుల గణన చేయడం అసలు ఏమాత్రం ఇష్టం లేదు. ఎందుకంటే, మా సీఎం రేవంత్ రెడ్డి చెప్పినట్టు... నరేంద్ర మోడీ లీగల్లీ బీసీ కావొచ్చు...ఎమోషనల్లీ ఓసీ అన్నది అక్షరసత్యం. తెలంగాణ ప్రభుత్వం ఎన్నో రోజులు తీవ్రంగా శ్రమించి సర్వేను విజయవంతం చేసింది. ఆ సర్వే నివేదికలను అసెంబ్లీలో ప్రవేశపెట్టిన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఫిబ్రవరి 4వ తేదీని సామాజిక న్యాయ దినోత్సవంగా పాటిద్దామని పిలుపునిచ్చారు. ఇంకా చెప్పాలంటే, రాష్ట్రంలోని ఈ రోజును సామాజిక స్వాతంత్ర్య దినంగా భావించాలి. ఇతర రాష్ట్రాలకు ఇదొక దిక్సూచిగా చెప్పవచ్చు. తెలంగాణను ఆదర్శంగా తీసుకొని దేశవ్యాప్తంగా కులగణనను చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ రాష్ట్ర శాసనసభ, శాసనమండలి తీర్మానాలు చేయడం దేశంలోని ఇతర రాష్ట్రాలకు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఒక బలమైన విజ్ఞప్తి ఇచ్చింది. స్వతంత్ర భారతంలో కులగణన చేపట్టిన రాష్ట్రంగా తెలంగాణ చరిత్రలో నిలిచిపోయింది. కులగణన సర్వేకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు ఏర్పడకుండా ఉండేందుకు రూ.160 కోట్లను ప్రభుత్వం ప్రత్యేకంగా కేటాయించిన విషయం విదితమే. అధికారికంగా 2024 ఫిబ్రవరి 4వ తేదీన సర్వే ప్రక్రియ ప్రారంభించి 2025 ఫిబ్రవరి 4వ తేదీని పూర్తి చేసింది. క్షేత్రస్థాయిలో 2024 నవంబర్ 6వ తేదీన సర్వే మొదలుపెట్టి 2024 డిసెంబర్ 25తో పూర్తి చేసింది. మొత్తంగా 3.70 కోట్ల జనాభా గల తెలంగాణలో 3.54 కోట్ల మంది నుంచి శాస్త్రీయ పద్ధతిలో సమాచారం సేకరించింది. సర్వేలో ఎలాంటి గందరగోళం లేకుండా ఒక్కో యూనిట్ 150 ఇళ్లను తీసుకొని ముందుకు వెళ్ళింది. ఇందుకు 1.03 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు తీవ్రంగా శ్రమించారు. వీరికి అదనంగా 76 వేల మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు కూడా పనిచేయడంతో అందరి కృషితో ఈ సర్వే జరిగింది. తెలంగాణ ప్రజలకిచ్చిన వాగ్దానాలపై ఏమాత్రం వెనక్కి వెళ్ళని కాంగ్రెస్ ఒక్కో హామీని పూర్తి చేస్తుండడం సంతోషకరం. అయితే, ఈ హామీలన్నీ నేరవేరుతుంటే ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలు తమ రాజకీయ ఉనికి కోల్పోతామనే భయంతో వణికిపోతున్నాయి. దీంతో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సర్వేపై విష ప్రచారం చేస్తున్నాయి. ప్రభుత్వం, బీసీ సర్వేపై నిరాధారమైన ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే కుట్ర చేస్తున్నాయి. 95 శాతంపైగా సర్వే పూర్తయ్యిందని ప్రభుత్వం లెక్కలతో సహా ప్రకటిస్తున్నా సర్వేను అసంపూర్తిగా ముగించారని విమర్శించడం వారి అజ్ఞానానికి నిదర్శనం. దేశంలో గతంలో ప్రతి పదేళ్లకు జనాభా లెక్కల్ని సేకరించేవారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చాక జనాభా లెక్కలకు బ్రేక్ పడింది. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో కూడా అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం కూడా జనాభా లెక్కలను గణించడం ఆపలేదు. మరి మన మోడీ ప్రభుత్వం ఎందుకు ఆపిందో బండి సంజయులు... కిషన్ రెడ్డిలు సమాధానం చెప్పడం లేదు. బీజేపీకి నిజంగా బీసీలపై ప్రేమ ఉంటే జనాభా లెక్కలు అధికారికంగా బీసీ గణన చేపట్టాలని డిమాండు చేయడం లేదో చెప్పాలి. ఇదివరకు దేశంలో బ్రిటీష్ వాళ్ళు అయినా... కాంగ్రెస్ పాలనలో అయినా అదే జరిగింది. కానీ, బీజేపీ మాత్రం అసలు కులాల గణాంకాలు... జనభా గణాంకాలపై ఏమాత్రం దృష్టి సారించడం లేదు. ఇక కేంద్రమంత్రి బండి సంజయ్... చరిత్రలో నమోదైన అంశాలు సీఎం రేవంత్ మాట్లాడితే ఎందుకంతా ఆయనకు భయమో ఆయనే సమాధానం చెప్పాలి. బీసీల పట్ల చిత్తశుద్ధితో కులగణన చేసిన ఘనత సీఎం రేవంత్ రెడ్డిదేనన్నది నేడు యావత్ దేశం చెబుతున్నది. అసలు ఈ చర్చంతా ఎప్పుడు ప్రారంభం అయింది. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల ప్రచార సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఏం చెప్పింది. తన మ్యానిఫెస్టోలో సామాజిక న్యాయ్(సోషల్ జస్టిస్) చేస్తానని చెప్పింది. బీసీ రిజర్వేషన్ల మీద సుప్రీంకోర్టు విధించిన 50 శాతం రిజర్వేషన్ల క్యాప్ తొలగిస్తానని చెప్పింది కదా. అందుకోసం కులగణన చేస్తామని ప్రకటించింది. దీంతో బీజేపీ ఒళ్ళు జలదరించినట్టయింది.

**మోడీకి ఎన్నికలు అంటే భావోద్వేగ స్పీచులు ఇచ్చుడు తప్పితే... బడుగు బలహీన వర్గాల కోసం కనీసం ఒక్క పని అయినా చేసినం అని చెప్పకునే పరిస్థితి ఉన్నదా? ఆయన హయాంలో 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కల్పించాడు. అంటే అగ్రకులాల్లో పేదలకు కల్పించాడు. అంటే ఆయన ఎమోషనల్లీ ఓసీ అనే కదా దాని అర్థం.**

అసలు ఓబీసీ అంటూ బీజేపీ మోడీని తెరపైకి తీసుకొచ్చింది కదా... ఓబీసీలకు ఆయన వల్ల ఒనగూరిన లాభం ఒక్కటైనా ఉన్నదా అసలు? బీజేపీ నాయకులు ఈ విషయంపై ఒక్క మాట ధైర్యంగా చెప్పగలుగుతారా? క్యాపిటల్ డిజిన్వెస్టుమెంట్ పాలసీ వల్ల ప్రభుత్వ రంగంలో ఉద్యోగాలు తగ్గిపోయాయి. అయితే, అటు ప్రభుత్వ రంగం, ప్రయివేటు రంగంలో బీసీలకు రిజర్వేషన్లపై మోడీ ఈ పదున్నరేండ్ల కాలంలో ఒక పది సెకండ్లు అయినా ఆలోచన చేసిండా? లేదా పది రూపాయాల మంచి అయినా చేసిండా? మోడీకి ఎన్నికలు అంటే భావోద్వేగ స్పీచులు ఇచ్చుడు తప్పితే... బడుగు బలహీన వర్గాల కోసం కనీసం ఒక్క పని అయినా చేసినం అని చెప్పుకునే పరిస్థితి ఉన్నదా? ఆయన హయాంలో 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కల్పించాడు. అంటే అగ్రకులాల్లో పేదలకు కల్పించాడు. అంటే ఆయన ఎమోషనల్లీ ఓసీ అనే కదా దాని అర్థం. ఈబీసీలకు రిజర్వేషన్లు ఇవ్వమని ఏ కమిటీ ఆయన్ను ఈ రిజర్వేషన్లు కల్పించమని కోరింది మోడీ గారిని. ఆగమేఘాల మీద రిజర్వేషన్లు కల్పించిన విషయం దేశమంతా చేయరా? మరి బీసీల్లో పేదల గురించి ఎవరు ఆలోచిస్తారు? ఆయన ఎందుకు ఆలోచించలేదని ఈ రోజు యావత్ బీసీ సమాజం ప్రశ్నిస్తున్నది. భారత దేశంలో కులం ఒక ప్రధాన అంశం. కులమే అనేక అసమానతలకు కారణం. అయితే, ఏ కులం ఎంత ఉందన్నది లెక్కిస్తే... కదా ఆ అసమానతలను రూపుమాపడం సాధ్యం అయ్యేది. ఆ పని చేద్దామంటే బీజేపీ నుంచి ఏమాత్రం స్పందన రాకుండా కేవలం ఉపరితల అంశాలకి మాత్రమే పరిమితం అవుతుండటం చూస్తుంటే... బీసీలు, బీసీ అభ్యున్నతిపై వారి చిత్తశుద్ధి ఏంటో అందరికీ అర్థం అవుతున్నది. ఇక మన బీజేపీ పార్టీ ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా వారు విడుదల చేసి మేనిఫెస్టోలో కనీసం బీసీ అన్న పదమే లేదు. ఇంతకంటే వివక్ష మరొకటి ఉంటుందా?

**తెలంగాణ ప్రజలకిచ్చిన వాగ్దానాలపై ఏమాత్రం వెనక్కి వెళ్ళని కాంగ్రెస్ ఒక్కో హామీని పూర్తి చేస్తుండడం సంతోషకరం. అయితే, ఈ హామీలన్నీ నేరవేరుతుంటే ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలు తమ రాజకీయ ఉనికి కోల్పోతామనే భయంతో వణికిపోతున్నాయి. దీంతో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సర్వేపై విష ప్రచారం చేస్తున్నాయి. ప్రభుత్వం, బీసీ సర్వేపై నిరాధారమైన ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే కుట్ర చేస్తున్నాయి. 95 శాతంపైగా సర్వే పూర్తయ్యిందని ప్రభుత్వం లెక్కలతో సహా ప్రకటిస్తున్నా సర్వేను అసంపూర్తిగా ముగించారని విమర్శించడం వారి అజ్ఞానానికి నిదర్శనం.**

బిజెపి మ్యానిఫెస్టోలో బిసిల ప్రస్తావనే లేదు అన్న ఈ విషయాన్ని బీసీ ఉద్యమ నేత ఆర్ కృష్ణయ్య, జాజుల శ్రీనివాస్ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా చెప్పారు. ప్రధాని మోడీయే స్వయంగా బీసీగా డబ్బా కొట్టుకున్నా_ _ _ బీసీల గురించి బీజేపీ మేనిఫెస్టోలో ఒక్క మాట లేదంటే_ _ _ ఆ పార్టీకి బీసీల అభ్యున్నతిపై చిత్తశుద్ధి ఏంటో తెలుసుకోవచ్చు. 70 కోట్లు ఉన్న బీసీల గురించి కనీస ప్రస్తావన లేకపోవడంపై మనం ప్రశ్నించాలి. వాస్తవానికి ఈ రోజు రేవంత్ రెడ్డి అదే ప్రశ్నించాడు. మోడీయే దొంగ బీసీ. అందుకే, ఆయన పార్టీ బీజేపీ బీసీలకు ఏం చేయడం లేదు. చేయదు కూడా అని చెప్పేశారు రేవంత్. ఇక కొత్త రాష్ట్రం వస్తే సబ్బండవర్గాల బతుకులు బాగుపడతాయని_ _ _ సామాజిక న్యాయం జరుగుతుందని తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ ఉద్యమ సమయంలో చెప్తుండేవారు. తెలంగాణ వచ్చి పదేండ్లయింది. అయితే, ఈ పదేండ్లలో కేసీఆర్ కుటుంబం, కేసీఆర్ కులపోళ్ళు తప్ప ఏ బీసీలు బాగుపడలేదు. బీజేపీ, బీఆర్ఎస్ వల్ల బడుగుల జీవితాల్లో ఎటువంటి మార్పూ రాలేదు అనేది నగ్నసత్యం. పదేండ్లలో కాలంలో తన ప్రభుత్వం నుంచి ఒక దళిత బిడ్డ తాటికొండ రాజయ్య, ఒక బీసీ బిడ్డ ఈటెల రాజేందర్ ను అత్యంత అవమానకర రీతిలో తన క్యాబినెట్ నుంచి తీసివేసిన దుర్మార్గపు పాలన చేసిండు కేసీఆర్. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం జనాభాలో 56 శాతానికి పైగా ఉన్న బీసీలను రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అణచివేసిండు. కాంగ్రెస్ పార్టీ మాత్రం కామారెడ్డి పట్టణ కేంద్రంలో బీసీ డిక్లరేషన్ విడుదల చేసి_ _ _ క్రమంగా దాన్ని అమలు చేసేందుకు ముందుకు కదులుతున్నది. అన్ని సేవా, వృత్తి కులాలకు న్యాయం చేస్తానని ప్రకటించిన విషయం తెలిసిందే. కానీ కాంగ్రెస్ మాత్రం బీసీలకు ఉద్యోగాల్లో వారి శాతం ఎంతనో అంతే శాతం రిజర్వేషన్లు ఇస్తామని ప్రకటించింది. అత్యంత కీలకమైన కుల గణన చేస్తామని అప్పుడు చెప్పింది_ _ _. ఇప్పుడు చేసి చూపింది. మా కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కుల గణన యావత్ దేశానికే ఆదర్శం. ఇదే విషయంపై పక్క రాష్ట్రాలు కూడా చర్చ చేసుకుంటున్నాయి. ఇదంతా అందరికీ తెలిసిందే. కమ్మరి, కుమ్మరి, మంగలి, సాకలి సబ్బంబడవర్ణాలు, సర్వ జనుల కోసం సమరం సాగేందుకు_ _ _, వారి సమస్యలు తీర్చేందుకు సిద్ధంగా ఉన్నది. ఆ విధంగానే అడుగులు వేస్తున్నది. బ్రిటీషర్స్ తర్వాత_ _ _ వేర్వేరుగా ఉన్న వేలాది కులాలను జనగణన చేసి గుర్తించి కాంగ్రెస్ పార్టీయే. బీజేపీ మూడుసార్లు గెలిస్తే ఈ దేశంలో_ _ _ ఒక్కసారి కూడా జనగణన చేయలేదు. కుల గణన అసలే చేయలేదు. ఇంతకంటే బీసీలకు ద్రోహం ఉంటుందా? ఎన్నో పోరాటాలు, మరెన్నో బలిదానాల తర్వాత దేశంలో 28వ రాష్ట్రంగా ఆవిర్భవించిన తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే, ఆయన ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్ళలోనే 2015లోనే కేవలం ఒకటే రోజు హడావుడి సర్వే చేస్తూ నాటకాలు చేసింది. ఏదో వేరే రాజ్యంతో యుద్ధం చేస్తున్నట్టు ఆగమేఘాల మీద సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించింది. మరి ఆ లెక్కలను అధికారికంగా కేసీఆర్ ప్రభుత్వం బయటపెట్టలేదు. తమ రాజకీయ స్వార్థానికి ఆ సర్వే నివేదికను ఉపయోగించుకున్న బీఆర్ఎస్ అగ్రనేతలు... ఇప్పుడు తప్పుడు లెక్కలతో సోషల్ మీడియాలో సమగ్ర కుటుంబ సర్వే నివేదిక అంటూ వైరల్ చేయడం వారి కపట రాజకీయ వైఖరికి నిలువుటద్దం. ఇక ఇంకో కీలక విషయం కూడా మన ఈ సందర్భంగా చర్చ చేసుకోవలి. గతంలో స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 23 శాతానికి తగ్గించింది బీఆర్ఎస్ ప్రభుత్వమే కదా. ఇప్పుడు కాంగ్రెస్ 42 శాతం టికెట్లు బీసీలకు ఇస్తామన్నా విమర్శించడంలో వారికి ఏమైనా బీసీల అభ్యున్నతిపై చిత్తశుద్ధి ఉందా అన్న విషయం గుర్తెరగాలి.

**తెలంగాణ వచ్చి పదేండ్లయింది. అయితే, ఈ పదేండ్లలో కేసీఆర్ కుటుంబం, కేసీఆర్ కులపోళ్ళు తప్ప ఏ బీసీలు బాగుపడలేదు. బీజేపీ, బీఆర్ఎస్ వల్ల బడుగుల జీవితాల్లో ఎటువంటి మార్పూ రాలేదు అనేది నగ్నసత్యం. పదేండ్లలో కాలంలో తన ప్రభుత్వం నుంచి ఒక దళిత బిడ్డ తాటికొండ రాజయ్య, ఒక బీసీ బిడ్డ ఈటెల రాజేందర్ ను అత్యంత అవమానకర రీతిలో తన క్యాబినెట్ నుంచి తీసివేసిన దుర్మార్గపు పాలన చేసిండు కేసీఆర్.**



- సత్తు మల్లేష్, గ్రంథాలయ కమిటీ ఛైర్మన్, కరీంనగర్

**రచనలకు ఆహ్వానం**
ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
7436939999

# తెలుగు రాజకీయాల్లో కొత్త పుస్తకాలు

తెలుగు రాజకీయాల్లో కొత్త పొలిటికల్ సిలబస్ బుక్స్ వచ్చాయి. అవి ప్రజల కోసం తామేదే చేస్తామని చెప్పే డెవలప్మెంట్ బుక్స్ కావు. అవి రివెంజ్ బుక్స్. ప్రతీ రాజకీయ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇబ్బందులు పడుతుంది. వారు అధికార పార్టీ విధానాలను వ్యతిరేకిస్తూ ఒక దశలో హద్దు దాటి కూడా వెళ్తారు. దాంతో ప్రభుత్వం అడ్డు కట్ట వేస్తుంది. ఆ పని చేసేది అధికారులూ పోలీసులే. అయితే ఇవి కొన్ని చోట్ల హద్దుదాటి ఉంటాయి. దాంతో వారిని ఇపుడు విపక్షాలు టార్గెట్ చేస్తున్నాయి. అయిదేళ్ళు మాత్రమే పార్టీ ప్రభుత్వాలు ఉంటాయని కానీ ముప్పయి అయిదేళ్ళ పాటు ఐఏఎస్ ఐపీఎస్ లు బాధ్యతలలో ఉంటారని వారు తప్పులు చేస్తే కనుక తాము బుక్స్ లో రాసుకుని అధికారంలోకి వచ్చాక ఇంతకు ఇంతా చెల్లిస్తామని సీరియస్ గానే వార్నింగ్ ఇస్తున్నారు. అసలు ఈ బుక్ కల్చర్ ఏంటి ఎందుకు వచ్చింది అంటే ఏపీలో వైసీపీ అయిదేళ్ళ పాలనలో అరాచకత్వం ఉందని టీడీపీ ఆరోపిస్తూ నిరసనలు చేసేది. ఇక యువగళం పాదయాత్రలో నారా లోకేష్ అయితే ఏకంగా రెడ్ బుక్ ని ప్రకటించి సంచలనం రేపారు. వైసీపీ నేతల అక్రమాలు అవినీతి మీద తాము రెడ్ బుక్ ఓపెన్ చేసి అందరి చిట్టాను రాసుకుంటున్నామని అధికారంలోకి వచ్చిన వెంటేనే ఒక్కొకరి విషయం తేలుస్తామని ఆనాడు కార్యకర్తల్లో ధైర్యం కోసం వార్నింగ్ ఇచ్చారు. ఆ తర్వాత టీడీపీ అధికారంలోకి వచ్చింది రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని వైసీపీ మండిపడుతోంది. ఇలా రెడ్ బుక్ పాపులర్ కావడంతో తెలంగాణాలోనూ బుక్ కల్చర్ పాకింది. అక్కడ విపక్షంలో ఉన్న బీఆర్ ఎస్ కూడా కాంగ్రెస్ పార్టీ హయాంలో తమను పెడుతున్న ఇబ్బందులు అలాగే అవినీతి అరాచకాలు చేసే వారి మీద పింక్ బుక్ ని ఓపెన్ చేయబోతున్నామని ప్రకటించింది. ఈ విషయాన్ని ఆ పార్టీ మహిళా నాయకురాలు కవిత పేర్కొంటూ కాంగ్రెస్ కి పింక్ బుక్ తో జవాబు చెబుతామని హెచ్చరించారు. ఇక బీజేపీ వంతు అన్నట్లుగా ఆ పార్టీ నాయకుడు, ఎంపీ అయిన ఈటెల రాజేందర్ తాము కాంగ్రెస్ హయాంలో అరాచకాల మీద కాషాయం బుక్ ని ఓపెన్ చేస్తామని ప్రకటించారు. ఇది కూడా ఇపుడు వైరల్ అవుతోంది. బీజేపీ ఆరెంజ్ బుక్ ఎందుకు ఓపెన్ చేయాల్సి వచ్చిందో ఈటెల వివరిస్తూ అధికారులు తప్పు చేస్తున్నారని వారి మీద చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. అలాగే కాంగ్రెస్ పాలనలో తప్పిదాలు చేసిన వారి మీద కూడా సీరియస్ యాక్షన్ ఉంటుందని వెల్లడించారు. గత పదేళ్ళుగా బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉంది. బీజేపీ వద్ద ఈడీ ఐటీ సీబీఐ అని అత్యంత బలమైన వ్యవస్థలు ఉన్నాయి. వాటిని తమ ప్రత్యర్థుల మీద బీజేపీ ప్రయోగిస్తుందని ఇప్పటికే విమర్శలు కూడా పెద్ద ఎత్తున ఉన్నాయి. బీజేపీ డబుల్ ఇంజర్ సర్కార్ అంటూంటారు. కానీ బీజేపీ ప్రత్యర్థులు మాత్రం ఈ మూడు వ్యవస్థలను చూపించి ట్రిపుల్ ఇంజన్ సర్కార్ అని సెటైర్లు వేస్తారు. బీజేపీ అత్యంత బలంగా కేంద్రంలో ఉంది. తలచుకోవాలి కానీ ట్రిపుల్ ఇంజన్ తో ప్రత్యర్థుల మీద పడడం ఖాయమని చెబుతారు. అలా జరిగిన సంఘటనలనూ గుర్తు చేసుకుంటారు. ఇక ఈటెల రాజేందర్ చెబుతున్నట్లుగా కాషాయం బుక్ ఒకటి ఓపెన్ చేయడం ఎందుకు దానిలో పేర్లు రాసుకుని తాము ఎపుడో అధికారంలోకి వచ్చాక యాక్షన్ తీసుకోవడం ఎందుకు అన్న దానిపై సోషల్ మీడియాలో రచ్చ జరుగుతోంది. తెలంగాణాలో కాంగ్రెస్ సర్కార్ ఉన్నా దేశంలో బీజేపీ ప్రభుత్వం ఉంది కదా. బీజేపీ తలచుకుంటే తన దగ్గర ఉన్న పదునైన వ్యవస్థలను ముందు పెట్టి కొరడా ఝులిపించవచ్చు కదా . ట్రిపుల్ ఇంజన్ నే తన దగ్గర ఉంచుకున్న బీజేపీకి ఏమి కావాలని కూడా ప్రశ్నిస్తున్నారు. ఏదో పొలిటికల్ గా అందరిలాగానే తామూ సెన్సేషనల్ స్టేట్మెంట్ ఇవ్వాలనుకుని ఈటెల వంటి వారు ఆరెంజ్ బుక్ అంటున్నారు తప్పించి బీజేపీకి మండితే ఈ బుక్కులతో పనేముందని కూడా హాట్ కామెంట్స్ చేసే వారూ ఉన్నారు. నిజానికి ఈ పొలిటికల్ బుక్స్ తో జనాలకు సంబంధం లేదు, ఇవన్నీ రివెంజ్ కోసం ఆయా పార్టీలు ఏర్పాటు చేసుకునే బుక్స్. అయితే తెలుగునాట ఈ న్యూ పొలిటికల్ సిలబస్ కే విలువ ఎక్కువగా ఉంది. అంతే కాదు ఇవే జనాల్లోకి పోతున్నాయి. అందుకే ఈటెల కూడా మాకూ ఒక బుక్ ఉంది, అడ్డంగా బుక్ చేస్తామని అంటున్నారని విశ్లేషణలు. రాజకీయాలకు పుస్తకాలతో పనేముంది? ప్రజలకు మంచి చేయాలనే చిత్తశుద్ధి ఉండాలి కానీ. కోరుకుంటే ప్రజలు ఎవరినైనా గుండెల్లో పెట్టుకుంటారు. ఎవరినైనా దింపేస్తారు. - ఆర్

ANN తెలుగు
# మహా పత్రిక
05
శుక్రవారం, హైదరాబాద్ | 21-02-2025 | జనరల్ వార్తలు | GENERAL NEWS | WWW.MAHAADAILY.COM



## వేసవిలో తాగునీటి ఇబ్బందులు రాకుండా
# చర్యలు చేపట్టాలి

**జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**



**ములుగు, మహా :** జిల్లాలో రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లో రానున్న వేసవిలో నీటి ఎద్దడి సమస్యను ఎదుర్కొనేందుకు సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మండలం వారిగా ఎన్ని పైప్ లైన్ లు ఉన్నాయి, పని చేస్తున్నాయా, ఏమైనా సమస్యలున్నయా అని పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని, ప్రజలకు తాగునీటి కొరత లేకుండా ప్రత్యేక కార్యాచరణను రూపొందించాలన్నారు. మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా నిరంతరం కొనసాగించేందుకు చర్యలు తీసుకోవాలని, మండలంలలో ఉండే పైపు లైన్లు, బోర్ల పనితీరును పరిశీలించి ఎక్కడైనా పైప్ లైన్ లు లీకేజీ ఉంటే మరమ్మతు పనులు చేపట్టాలన్నారు. ప్రతీ గ్రామంలో నీటి వనరుల స్థితిగతులను పర్యవేక్షించేందుకు స్థానిక అధికారులను బాధ్యతగల వ్యక్తులుగా నియమించాలని, వేసవి కాలంలో నీటి సరఫరా విషయంలో ఎలాంటి సమస్య ఏర్పడకుండా చూడాలన్నారు. బోరుబావుల మరమ్మతులు చేపట్టే మెకానిక్ లను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, బోరు చెడిపోయిందన్న సమాచారం అందిన వెంటనే గంటల వ్యవధిలోపు మరమ్మతులు పూర్తి చేయించి దాహార్తి సమస్య ఏర్పడకుండా సత్వరమే పనులు జరిపించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఏ ఒక్క నివాస ప్రాంతంలోనూ తాగునీటి సరఫరాకు అంతరాయం తలెత్తకుండా అంకితభావంతో పని చేయాలని, నీటి సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షించాలని హితవు పలికారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్ రావు, ఆర్ డబ్లూఎస్ ఎస్ఈ మల్లేశం, ఈఈ సుభాష్, డీపీవో దేవ్ రాజ్, ఆర్ డబ్లూఎస్ డీఈలు, ఎంపీడీవోలు, ఏంపీఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్ళండి
## స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండండి..ఝాన్సీ రెడ్డి

**పాలకుర్తి, మహా :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టికెట్లు దక్కని నాయకులను,కార్యకర్తలను బుజ్జగించేందుకు టికెట్లు దక్కిన వారు, దక్కని వారి మధ్య సమన్వమయం చెయ్యడానికి కాంగ్రెస్ పార్టీ ఒక సమన్వయ కమిటీని నియమించింది. సమన్వయ కమిటీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జిగా ఝాన్సీ రెడ్డి నియమించారు. గురువారం కోడకండ్ల మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సమన్వయ కమిటీని పార్టీ అధ్యక్షులు సురేష్ నాయక్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఝాన్సీ రెడ్డి సమన్వయ కమిటీ నీ ఉద్దేశించి మాట్లాడుతూ...కమిటీలో బాధ్యులు హంగులు ఆర్భాటాలు లేకుండా నిష్పక్షపాతంగా పని చెయ్యాలన్నారు. ఈ కమిటీ పార్టీ నిర్ణయాలను సమర్థవంతంగా అమలు చేయడం గ్రామ సభ్యుల మధ్య మెరుగైన సహకారాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఏర్పాటు చేశామన్నారు.



**సమన్వయ కమిటీ ప్రధాన బాధ్యతలు..**

పార్టీ విభాగాల మధ్య సమన్వయం, విభాగాల మధ్య సమర్థవంతమైన కమ్యూనికేషన్ ఏర్పాటు చేయడం, సంబంధిత వ్యవస్థల మధ్య ఎప్పటికప్పుడు సమాచారం మండల అధ్యక్షునికి గానీ,సందర్భాన్ని బట్టి పార్టీ కార్యాలయానికి అందించి పార్టీని మెరుగుపరచడం, అలాగే పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే నియంత్రణ చేసి పర్యవేక్షణ చేయడం, హైకమాండ్ ఆదేశాలను అమలు చేసి పార్టీ పురోగతిని పెంపొందించడం వంటివి సమన్వయ కమిటీ యొక్కబాధ్యతలని ఝాన్సీ రెడ్డి కమిటీ సభ్యులను సూచించారు.

**సమన్వయ కమిటీ పరిష్కరించే సమస్యలు...**

ఎన్నికల్లో పోటీ చేసే ఉత్సాహవంతుల మధ్య అభిప్రాయ భేదాలు సాంకేతిక సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించడంతోపాటు పార్టీ రాష్ట్రస్థాయి, నియోజకవర్గ స్థాయిలో తీసుకున్న నిర్ణయాలను అమలు చేయడం వంటివి అలాగే భవిష్యత్తు ప్రణాళికలను రూపొందించడంలో సహకారం అందించడం సమన్వయ కమిటీకి ప్రాముఖ్యత ఉంటుందని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ బ్లాక్ కమిటీ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, పాలకుర్తి నియోజకవర్గం యూత్ అధ్యక్షులు రాజేష్ నాయక్, మాజీ సర్పంచ్ ,పట్టణ అధ్యక్షులు రవీందర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలుగుకు వెలుగునిద్దాం

**సాహిత్య కళా వేదిక అధ్యక్షుడు కర్ర శ్రీనివాస్**



**హుజూర్ నగర్, మహా:** ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం పురస్కరించుకొని స్పందన సాహిత్య కళావేదిక అధ్యక్షుడు కర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ తెలుగుకు వెలుగునిద్దామని తెలుగు భాషను పరిరక్షించుకుంటూ అభివృద్ధి చేయవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు తల్లి ఒడిలాంటి తెలుగు భాషను తరతరాలు సజీవంగా మాట్లాడుకునేటట్లు అందరూ ఆదరించాలని ప్రతి గ్రామంలో గ్రంథాలయాలను సక్రమంగా పనిచేసేటట్లు చేసి తెలుగు సాహిత్యాన్ని తెలుగు భాషను పాఠకుల అందరికీ గుర్తించుకునేటట్లు చేయాలని సుమధుర సుందర ఆణిముత్యం లాంటి తెలుగు భాషను అందరం కలిసి మక్కువ చూపి తెలుగు భాషను మాట్లాడుకుంటూ తెలుగు భాషను వెలిగించుకుందామని తెలిపారు.



## మత్తు పదార్థాల నియంత్రణ పై
# ప్రత్యేక దృష్టి సారించాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వరంగల్, మహా:** జిల్లాలో మత్తు పదార్థాల నియంత్రణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, దీనిపై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో గురువారం అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డిసిపి రవీందర్ లతో కలిసి మాదక ద్రవ్యాలు, డ్రగ్స్ నియంత్రణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో మత్తు పదార్థాల నియంత్రణ పై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. జిల్లాలోని 16 పీఎం శ్రీ ప్రభుత్వ పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాల నిర్వహణకు ప్రణాళికలు రచించాలని, అవగాహన, చైతన్యం కల్పించడం వల్ల సమాజంలో మార్పును తీసుకు రావచ్చునని అన్నారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల్లో మత్తు పదార్థాల నియంత్రణకు చేపడుతున్న చర్యలు గురించి, ఇప్పటివరకు ఎన్ని కేసులు నమోదయ్యాయనే వివరాలను పోలీసు, ఎక్సైజ్, టిఎస్ న్యాబ్, అటవీ, జీఆర్పీ పోలీసులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వరంగల్ సెంట్రల్ జోన్ డిసిపి రవీందర్ మాట్లాడుతూ ప్రతి నెల నార్కోటిక్ కో ఆర్డినేషన్ మీటింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మత్తు పదార్థాల కు సంబంధించిన సమాచారాన్ని డయల్ 100, సమీప పోలీస్ స్టేషన్ కు తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ ఓ విజయలక్ష్మి, డీఎం హెచ్వో డాక్టర్ సాంబశివరావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ చందర్, ఎఫ్ ఆర్ ఓ సందీప్, నార్కోటిక్స్ డిఎస్పీ సైదులు, ఇన్స్పెక్టర్ రవీందర్, డ్రగ్స్ ఇన్స్పెక్టర్ రవీందర్, అరవింద్ కుమార్, టీఎస్ న్యాబ్, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కోర్టు ఆర్డరుతో అక్రమ నిర్మాణాన్ని పోల్చివేత

**ఇబ్రహీంపట్నం, మహా:** అంబేద్కర్ చౌరస్తాలో అక్రమంగా నిర్మించిన ఓ కట్టడాన్ని కూల్చివేసిన మున్సిపల్ అధికారులు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ ఓ అక్రమ నిర్మాణాన్ని మున్సిపల్ అధికారులు టౌన్ ప్లానింగ్ అధికారి ఆధ్వర్యంలో గురువారం ఉదయం పోలీసుల సమక్షంలో కూల్చివేశారు. కట్టడాన్ని అక్రమంగా నిర్మించారంటూ వారికి గతంలో నోటీసులు ఇవ్వడం జరిగిందని అన్నారు. రోడ్డు ఆక్రమణకు గురైనట్టు కోర్టు ఆర్డర్ రావడంతో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయడం జరిగిందని మున్సిపాలిటీ కమిషనర్ రవీందర్ సాగర్ తెలిపారు. గతంలో ఈ నిర్మాణం కూల్చడానికి వచ్చిన మున్సిపల్ అధికారులను



అడ్డుకున్న నోముల గ్రామానికి చెందిన దండేటి కర్ రవి, సత్యనారాయణ తమ దుకాణం కూల్చవద్దు అంటూ పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేశారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించాలి

- కలెక్టర్ దివాకర టీఎస్
- రామాంజపూర్ ఆశ్రమ బాలికల పాఠశాల ఆకస్మిక తనిఖీ





**ములుగు, మహా:** విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఆదేశించారు. గురువారం ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం రామంజాపూర్ లోని ప్రభుత్వ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో ముచ్చటిస్తూ మెనూ ప్రకారంగా భోజనం అందిస్తున్నారా, నాణ్యతగా, రుచికరంగా ఉంటుందా?, విద్య బోధిస్తున్న తీరును కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. డైనింగ్ హాల్, పడక గదులు, పరిసరాలు, స్టోర్, వంట గదులను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలకు స్వచ్ఛమైన, రుచికరమైన ఆహారం అందించాలని, ఆహారం వండే సిబ్బంది పరిశుభ్రంగా చేతులు కడుక్కొని ఆహార పదార్థాలను సిద్ధం చేయాలని సూచించారు. స్వచ్ఛమైన త్రాగు నీరు అందించాలని, నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా చూసుకోవాలని, ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రత, మానసిక వికాసం కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించా లన్నారు. షెడ్యూల్ ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రతీ సబ్జెక్టు పై ఎలాంటి సందేహాలు ఉన్న సమాధానాలు చెబుతూ విద్యా బోధన అందించాలని సూచించారు. విద్యార్థుల పట్ల తమ స్వంత పిల్లల్లా శ్రద్ధ వహిస్తూ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం, మెరుగైన విద్యాబోధన, సరైన వసతి సదుపాయాలను కల్పించాలన్నారు. ముఖ్యంగా ఆదివారం మెనులో విద్యార్థులకు అందించే భోజనం ఫోటోలు గూగుల్ షీట్ లో పంపాలని ఆదేశించారు. ఆకస్మిక తనిఖీ చేపటడతామని, ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.



## కాంగ్రెస్ తోనే నియోజకవర్గ అభివృద్ధి

**ఎమ్మెల్యే మందుల సామేల్**

**మోత్కూర్,మహా:** కాంగ్రెస్ తోనే తుంగతుర్తి నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు.గురువారం అడ్డగూడూరు మండలం ధర్మారం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ..తుంగతుర్తి నియోజకవర్గం నూరు అభివృద్ధి చెందుతుందని కాంగ్రెస్ గవర్నమెంట్ ఏర్పడిన తర్వాత ఇప్పటివరకూ నియోజకవర్గంలో రూ, 1300 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. గత ప్రభుత్వం బిక్కేరుపై వదిలిపెట్టిన ఏడు చెక్కు డ్యాం లను కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పూర్తి చేశామన్నారు.రూ, 13 కోట్లతో అన్ని గ్రామాలలో సిసి రోడ్ల నిర్మాణ పనులు చేశామని.. ఈ ఏడాది అన్ని గ్రామాల్లో రూ, 14 కోట్లు తో మిగిలిన సిసి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తి చేస్తామని చెప్పారు. తుంగతుర్తి నియోజకవర్గంలో రైతులు బాగుండాలని పంటలు బాగా పండాలని బిక్కేరులోకి గోదావరి నీళ్లు తెచ్చామన్నారు. తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన లో అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్, వృద్ధాప్య పెన్షన్లు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామన్నారు.అనంతరం అడ్డగుడూరు మండల కాంగ్రెస్ పార్టీ తాత్కాలిక అధ్యక్షుడుగా చౌల్లరామారం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు నిమ్మనగోటి జోజి ని నియమించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

#### సైన్స్ ప్రగతి మానవాళి అభివృద్ధికి
## గీటు రాయి



**హుజూర్ నగర్, మహా:** జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా సైన్స్ వారోత్సవాలలోభాగంగా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జేవీవి నాయకులు పీవీ దుర్గాప్రసాద్ మానవ ప్రగతిలో సైన్స్ పాత్ర గురించి జడ్.పి.హెచ్.ఎస్ బురుగడ్డ,కరక్కయలగూడెం పాఠశాలలో వివరించారు.ఇట్టి కార్యక్రమంలో వారు మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దక్పథాన్ని పెంపొందించుకోవాలని డార్విన్ జీవరిణామ సిద్ధాంతాన్నిగురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు నలబోలు శ్రీనివాసరెడ్డి ఉపాధ్యాయులు బొల్లం వెంకటేశ్వర్లు, ఆర్ శ్రీనివాస్, వీరాస్వామి, మైసయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**హుజూర్ నగర్, మహా:** ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ హుజూర్ నగర్ పోలీసులు పట్టుకున్నారు.హుజూర్ నగర్ ఎస్సై జి ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం గురువారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో నమ్మదగిన సమాచారంతో సిబ్బందితో లింగగిరి గ్రామానికి వెళ్లే మార్గమధ్యలో కాచవారిగూడెం స్టేజ్ వద్దకు రాగానే హుజూర్ నగర్ పట్టణానికి చెందిన యరగొర్ల గంగరాజు అనే వ్యక్తి ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా లింగగిరి వాగు నుండి ఇసుక రవాణా చేస్తుండగా ట్రాక్టర్ ను పట్టుబడి చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని ఎస్సై తెలిపారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం

- కంది శ్రీనివాస రెడ్డి నేతృత్వంలో కార్యక్రమం
- ఎన్నికల్లో అనుసరించిన
- వ్యూహాలపై శ్రేణులకు దిశానిర్దేశం





**ఆదిలాబాద్ మహా :** ఉమ్మడి కరీంనగర్ ఆదిలాబాద్ నిజామాబాద్ మెదక్ జిల్లాల కాంగ్రెస్ పార్టీ పట్ట భద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి పూట్కూరి విజయాన్ని ఒక చాలెంజింగ్ గా తీసుకుని పని చేయాలని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు.గురువారం తన క్యాంపు కార్యాలయం ప్రజా సేవాభవన్ లో నియోజక వర్గ కాంగ్రెస్ శ్రేణులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించిన వ్యూహాలపై పెద్ద ఎత్తున హాజరైన శ్రేణులకు దిశానిర్దేశం చేసారు. తన క్యాంపు కార్యాలయ సిబ్బందితో నియోజకవర్గంలో ఉన్న దాదాపు 8వేల మందికి పైగా పట్టభద్రలకు ఫోన్ చేసి నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యతా ఓటు వేయ వేయవలసిందిగా కోరినట్లు చెప్పారు. ప్రతీ పట్ట భద్రుడిని కలిసి ఓటు అభ్యర్ధించాలన్నారు.ఒక ప్రణాళిక బద్ధంగా వెళ్తూ ఓట్లు సాధించాలన్నారు.ముఖ్యంగా తమవద్ద ఉన్న గ్రాడ్యుయేట్ ఓటర్ల జాబితా ప్రకారం వారి వారందరిని కలిసే విధంగా పనిచేయాలన్నారు.ఆదిలాబాద్ పట్టణంతో పాటు ప్రతి మండలం గ్రామంలో పట్టభద్రుల వివరాలు సేకరించడం జరిగిందని ఇంటింటికి వెళ్లి వారందని కలిసి ఓట్లు అడగాలన్నారు. ఈ ఐదు రోజులు చాలా కీలకమని చెప్పారు. ఒక పద్ధతి ప్రకారం వెళితేనేవిజయం సాధ్యమన్నారు.పోలింగ్ బూతుల వారీగా ఇంచార్జీలు కష్టపడి పని చేయలన్నారు. నియోజకవర్గంలోని ప్రతీ గ్రామంలో గల పట్టభద్రుల వివరాలు తెలుపుతూ ఆయా గ్రామాల ముఖ్యనేతలు ఇంచార్జీల బాధ్యతలను వివరించారు. ప్రతీ ఇంటికి పోలింగ్ స్లిప్పులతో పాటు కరపత్రాలు పంచాలన్నారు. పోలింగ్ బూతుల వివరాలను చదవి వినిపించారు.కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ మేనిఫెస్టోలోని అంశాలు సకాలంలో జాబ్ క్యాలెండర్ అమలు ,గ్రంధాలయాల పునరుద్ధరణ ,విశ్వవిద్యాలయాల అభివృద్ధి ,పాత పెన్షన్ విధానం అమలు , అంతర్జాతీయ క్రీడా ప్రాంగణం,ప్రైవేట్ ఉద్యోగులకు బాసట,న్యాయవాదుల రక్షణ చట్టం,మోడల్ స్కూళ్లు ,కేజీబీవీ, గురుకుల టీచర్ల సమస్యల పరిష్కారం, నిరుద్యోగుల ఉపాధి కల్పన లాంటివాటిని ప్రతీ గ్రాడ్యుయేట్ కు వివరించాలన్నారు. ఇలా ప్రతీ నాయకుడు కార్యకర్త నరేందరన్న విజయం కోసం కృషిచేయాలని పిలుపునిచ్చారు. మంచి మేధావిని చట్టసభకు పంపితే ఆయన ఇచ్చిన హామీలన్ని నెరవేస్తారన్నారు. ఈకార్యక్రమంలో ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజక వర్గంలోని అన్ని మండలాలు గ్రామాల నుండి ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




## పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డ ఇద్దరు దొంగలు
### 17 లక్షల బంగారం.. 8700 నగదు స్వాధీనం
### పోలీసులను అభినందించిన సి పి.. డిసిపి

**హనుమకొండ, మహా:** హనుమకొండ జిల్లా మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలో గల అయోధ్య పురం రైల్వే గేట్ వద్ద మడికొండ పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా ఇద్దరు యువకులు అనుమానాస్పదంగా సంచరించడం గమనించి వారిని పట్టుకుని వారి వివరాలు అడగడంతో పొంతనలేని సమాధానాలు చెప్పారు. ఇది గమనించిన పోలీసులు వారిని సెర్చ్ చేయగా ఇద్దరి వద్ద రెండు కవర్ లు గుర్తించి అందులో ఏమి ఉంది అని అడుగగా వారు బంగారం ఉందని చెప్పడంతో వెంటనే వారిని అదుపులోకి తీసుకొని ఇద్దరు పంచుల సహాయంతో పంచనామ నిర్వహించగా వారి వద్ద బంగారం లభించింది. ఇది ఎక్కడిది అని వారిని ప్రశ్నించగా ఈ నెల 12/02/2025 తేదీన రాజీవ్ గృహ కల్ప, ఇందిరమ్మ కాలనీ, కడిపికొండ లో నివాసం ఉంటున్న కోట శ్రీనివాస్ ఇంట్లో నుండి దొంగిలించామని చెప్పడం తో వెంటనే పంచులను తూకం వేసే వ్యక్తిని పిలిచి దానిని తూకం వేయగా సుమారు 240గ్రాములు ఉంది. వీటి విలువ సుమారు 17 లక్షల రూపాయలు ఉంటుందని నిందితుల వద్ద 8700/ రూపాయలు నగదును స్వాదినం చేసుకోవడమైనది.



నేరస్థుల వివరాలు తెలుసుకోగా వారి పేర్లు బానోత్ ఉదయ్, బిర్రు ప్రణీత్ లుగా పోలీసులకు తెలిపారు. ఈ సందర్భంగా దొంగలను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన ఖాజీపేట ఏసిపి తిరుమల్, మడికొండ ఇన్స్పెక్టర్ పుల్యాల కిషన్, ఖాజీపేట ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డి, ధర్మసాగర్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ , కమలాపూర్ ఇన్స్పెక్టర్ హరికృష్ణ , వంగర సబ్ ఇన్స్పెక్టర్ దివ్య ని, మడికొండ సబ్ఇన్స్పెక్టర్ రాజ్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ రామ్ చందర్, హెడ్ కానిస్టేబుళ్లు రామనాధం, రాకేష్ నాగరాజు తోపాటు ఇతర సిబ్బందిని వరంగల్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా ఐపీఎస్ తోపాటు సెంట్రల్ జోన్ డీసీపీ షైక్ సలీమా ఐపీఎస్, అభినందించారు.

#### శ్రీ ఉదయ్ హాస్పటల్ పై
## ఐఎంఏకు ఫిర్యాదు



**హనుమకొండ, మహా:** హనుమకొండ శ్రీ ఉదయ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ లో తనకు జరిగిన అన్యాయంపై గురువారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వరంగల్ జిల్లా జనరల్ సెక్రెటరీ డాక్టర్ అజిత్ కు బాధితుడు సదానందం ఫిర్యాదుతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వినతి పత్రంతో జత చేసిన రిపోర్ట్స్ చూసి సానుకూలంగా స్పందించిన ఐఎంఏ వరంగల్ జిల్లా జనరల్ సెక్రెటరీ డాక్టర్ అజిత్ బాధితుడు ఇచ్చిన శ్రీ ఉదయ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ ఫిర్యాదుపై ఐఎంఏ ఈసీలో చర్చించి పూర్తి స్థాయి విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చినట్లు బాధితుడు సదానందం తెలిపారు.



## ప్రమాద భీమాతో జర్నలిస్టులకు ధీమా

- జనగామ కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్
- జర్నలిస్టులకు ఉచిత ప్రమాద బీమా పత్రాలు అందజేత

**జనగామ, మహా:** నిరంతరం పని ఒత్తిడిలో ఉండే జర్నలిస్టులకు వ్యక్తిగత ప్రమాద భీమా ఉపయోగపడుతుందని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. టీ.ఎస్.జే.యు రాష్ట్ర అధ్యక్షులు నారగోని పురుషోత్తం గౌడ్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్, జాయింట్ సెక్రటరీ రావుల నరేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగరాజు ఆధ్వర్యంలో జనగామ జిల్లా టీఎస్ జేయు యూనియన్ సభ్యులందరికీ ఐదు లక్షల ఉచిత ప్రమాద భీమా సౌకర్యాన్ని అందజేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో దీనికి సంబంధించిన బీమా పత్రాలను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ చేతుల మీదుగా సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో భాగంగా ఎంతో మంది జర్నలిస్టులు ప్రమాదాలకు గురై ఇబ్బందులు పడుతుంటారు. ఆ సమయంలో వీరికి ప్రమాద బీమా ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. జర్నలిస్టులందరికీ ప్రమాద బీమా కల్పించడం పట్ల తెలంగాణ జర్నలిస్టు యూనియన్ నాయకులను కలెక్టర్ ఈ సందర్భంగా అభినందించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులకు గల పలు సమస్యలను జర్నలిస్టు నాయకులు కలెక్టర్ కు తెలియజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో జర్నలిస్టులను గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్ జేయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్, సహాయ కార్యదర్శి రావుల నరేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగపురి నాగరాజు లతో పాటు టీ ఎస్ జేయూ జనగామ జిల్లా అధ్యక్షులు ఉప్పలంచి నరేందర్, ప్రధాన కార్యదర్శి బొమ్మగాని శ్రీకాంత్ గౌడ్, కోశాధికారి కొన్నె ఉపేందర్, గౌరవ సలహాదారు చిల కిరణ్ కుమార్, గౌరవ అధ్యక్షులు ఎం.శివ కుమార్, యూనియన్ ప్రతినిధులు పి.రాజు, చెల్లోజు నవీన్ చారి, ఓంకార్, అఫ్రోజ్, గన్ను కార్తీక్, వినోద్, లక్ష్మయ్య, పాండు, దేశాయ్ రెడ్డి, చిటుకుల అంజయ్య, గండి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించాలి

- భక్తులకి ఎలాంటి అసౌకర్యం కలగకుండ పటిష్ఠ చర్యలు
- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**హుజూర్ నగర్, మహా:** మేళ్ళచేర్వు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు కన్నుల విందుగా నిర్వహించేలా ముమ్మర ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. గురువారం మేళ్లచెర్వు శివాలయంలో ఈ నెల 23 నుండి జరగనున్న శివరాత్రి జాతర ఏర్పాట్లపై అధికారులతో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శివరాత్రి జాతర వైభవంగా నిర్వహించేందుకు ఇప్పటి నుండి ఏర్పాట్లు మొదలుపెట్టి భక్తులకి ఎలాంటి అసౌకర్యం కల్గించకుండా చూసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. శివరాత్రి జాతరకి లక్షలాది భక్తులు వచ్చే అవకాశం ఉంది కాబట్టి వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా దైవ దర్శనం అందేలా క్యూ లైన్లు ఏర్పాట్లు చేయాలని, దేవాలయం ఆవరణలో సి సి కెమెరాలు ఏర్పాటు, వి ఐ పి లకి ప్రత్యేక దర్శనం కొరకు భక్తులకి ఇబ్బంది లేకుండా ప్రత్యేక లైన్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఎడ్లపందాలు, కబడ్డీ పోటీలు జరిగే ప్రదేశం లో వీక్షకులకి ఎండ తగలకుండా చలవ పందిర్లు ఏర్పాటు చేయాలన్నారు. దేవాలయం బయట భక్తుల కొరకు యల్ ఈ డి స్క్రీన్ లు ఏర్పాటు చేయాలన్నారు. దేవాలయ ప్రాంతం నుండి సబ్ స్టేషన్ వరకు ఏర్పాటు చేసే దుకాణాలకు రుసుము తీసుకొని అనుమతి ఇవ్వాలని అన్నారు. దేవాలయం చుట్టూ పూల మొక్కలను నాటాలని సూచించారు. జాతర కొరకు కేటాయించిన అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ జాతరను విజయవంతం చేయాలన్నారు. పంచాయతీ అధికారులు జాతర జరిగే ప్రాంతాలను ఎప్పటికప్పుడు ఎక్కువ సిబ్బందిని, ట్రాక్టర్లను షిఫ్ట్ ల వారీగా ఏర్పాటు చేసుకొని పరిశుభ్రం చేయాలని, త్రాగు నీరు కొరకు ట్యాంకర్లు, భక్తులకి ఎలాంటి ఇబ్బంది లేకుండా తాత్కాలిక శాశ్వత టాయిలెట్స్ ఏర్పాటు వీధిదీపాలు అన్ని వెలిగేలా చూసుకోవాలని సూచించారు. అన్నదానం జరిగే కల్యాణ మండపం ముందు డ్రైనేజీ పరిశుభ్రం చేయాలని, భక్తులకి త్రాగునీటి వసతి కల్పించాలని సూచించారు. మిషన్ భగీరథ అధికారులు పంచాయతీ అధికారులు సమన్వయం చేసుకుంటూ భక్తులకి త్రాగునీటి సమస్య లేకుండా చూచుకోవాలని తెలిపారు. దుకాణాలు రోడ్డు మీదకి రాకుండా వారికి కేటాయించిన స్థలాలలో మాత్రమే దుకాణాలు ఏర్పాటు చేసుకునే విధంగా చూడాలన్నారు. సబ్ స్టేషన్ నుండి యన్ ఎస్ పి కాల్వ వరకు పెట్టె దుకాణాల నుండి రుసుము తీసుకొని వారికి అనుమతి ఇవ్వాలని సూచించారు. మేళ్లచెరువు డివైడర్ మధ్యలో మొక్కలు నాటి సుందరికరించాలని, పి హెచ్ సి ముందు ఉన్న పెంట కుంపను, అలాగే చౌటపల్లి రోడ్డు లో యన్ యస్ పి కాల్వ వెంట ఉన్న చెత్తను తరలించాలని పంచాయతీ అధికారులకు సూచించారు. నీటిపారుదల అధికారులు భక్తులు స్నానం చేసేందుకు చింత్రియాల మేజర్ కాల్వలో 3 అడుగుల ఎత్తులో మాత్రమే నీరు ప్రవహించేలా చూసుకోవాలన్నారు.

## శ్రీరాములుకు పరామర్శ



**పాలకుర్తి, మహా:** పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జి ఝాన్సీ రాజేందర్ రెడ్డి, దేవరుప్పల మండల అధ్యక్షులు నల్ల శ్రీరామ్ నిమ్స్ హాస్పటల్లో అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతుండగా గురువారం హాస్పిటల్ కి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఝాన్సీ రాజేందర్ రెడ్డి, ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సంబంధిత వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఝాన్సీ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ కార్యకర్తలు, నాయకులు ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని, ఆరోగ్య సమస్యలు ఎదురైనప్పుడు వెంటనే మెడికల్ సలహాలు తీసుకోవాలని సూచించారు. అనారోగ్య సమయంలో మనోధైర్యం ఎంతో ముఖ్యం అని, కుటుంబ సభ్యులు, స్నేహితులు, పార్టీ సహచరులు మద్దతుగా ఉండాలని వారు పేర్కొన్నారు.

## సీఎంఆర్ మిల్లింగ్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయండి

### వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్, మహా:** రబీ 202324 సీఎంఆర్ మిల్లింగ్ ప్రక్రియ వచ్చే మార్చి 17 నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. గురువారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో రబి 2024 25 ధాన్యం సేకరణ, 202324 సి.ఎం. ఆర్ మిల్లింగ్ ప్రక్రియపై జిల్లా కలెక్టర్ సత్య శారద పౌర సరఫరాల అధికారులు, సంస్థ మేనేజర్, మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2024 25 రబి సీజన్లో. 2 లక్షల 10 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం వస్తుందని అంచనా ఉందని, ధాన్యాన్ని సేకరించేందుకు ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలన్నారు. 2023 24 ఖరీఫ్ సీఎంఆర్ 100% వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు గోదాంలో ధాన్యం నిల్వలను పరిశీలిస్తూ ఉండాలన్నారు. రైస్ మిల్లర్ల నుండి బ్యాంగ్ గ్యారెంటీ పత్రాలను తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా పంపిణీ వ్యవస్థనుండి సరఫరా అవుతున్న బియ్యం దుర్వినియోగం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఇంకను బ్యాంక్ గ్యారంటీలు ఇవ్వని మిల్లర్లు వెంటనే సమర్పించాలని అన్నారు. సీ ఎం ఆర్ బియ్యం డెలివరీ సమయంలో బఫ్ఫర్ గోడౌన్ ల వద్ద టెక్నికల్ అసిస్టెంట్ల కొరత వల్ల లారీలు ఆగుతున్నాయని, టెక్నికల్ అసిస్టెంట్లను కేటాయించాలని మిల్లర్లు కలెక్టర్ ను కొరగా, రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్ కు ప్రతిపాదనలు పంపడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి డిఆర్ఓ విజయలక్ష్మి, డిఎఓ అనురాధ, జిల్లా పౌర సరఫరాల అధికారి కిష్టయ్య, పౌరసరఫరాల సంస్థ మేనేజర్ సంధ్యారాణి, డిఆర్డీఓ కౌసల్యాదేవి, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, జిల్లా కోఆపరేటివ్ అధికారి నీరజ, ఆర్డీఓ ఉమారాణి మిల్లర్ అసోసియేషన్ ప్రతినిధులు, మిల్లర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### మహాశివరాత్రి వేడుకలకు
## మంత్రికి ఆహ్వానం



**వరంగల్, మహా:** వేములవాడ శ్రీ రాజ రాజేశ్వర స్వామి దేవస్థానంలో జరిగే మహాశివరాత్రి వేడుకలకు రావాలని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ను ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఎండోమెంట్ ప్రిన్స్ పల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ శ్రీధర్, అడిషనల్ కమిషనర్ క్రుష్ణవేణి, ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రసాదం అందజేయగా, అర్చకులు వేదాశీర్వచనం ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ... వేములవాడు రాజరాజేశ్వర స్వామివారి జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. భక్తులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని అలాగే భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో ఎక్కడా రాజీ పడొద్దని సూచించారు.

### వరంగల్ పోచమ్మ మైదాన్ లో
## దారుణం

- భార్యతో సహా అత్తా మామ పై అల్లుడు కత్తితో దాడి
- ప్రేమ వివాహం కాస్త ప్రాణాల మీదికి





**వరంగల్, మహా:** ప్రేమ వివాహం కాస్త ఓ కుటుంబం ప్రాణాల మీదికి తెచ్చింది. వరంగల్ నగరంలోని 22వ డివిజన్ రత్న హోటల్ ఎదురుగా భారతి డిగ్రీ కళాశాల లైన్లో నివాసం ఉంటున్న జన్ను బాబు కుటుంబంపై అల్లుడు కత్తితో దాడి చేశాడు.

**వివరాల్లోకెళ్తే..**
గతంలో జన్ను బాబు కుమార్తె పల్లవి, ఉర్సు ప్రాంతానికి చెందిన కోట చంద్రశేఖర్ తో ప్రేమ వివాహం చేసుకున్నారు. కొన్ని రోజుల పాటు బాగానే కలిసి ఉన్నారని, గత ఏడాది కాలంగా గొడవలు జరుగుతున్నాయి. కాగా ఏడాది నుండి దూరంగా ఉంటున్న అల్లుడు చంద్రశేఖర్ గురువారం సాయంత్రం పోచమ్మ మైదానం లో భార్య నివాసం ఉంటున్న ఇంటికి వచ్చి భార్య తోపాటు అడ్డువచ్చిన అత్త, మామ లపై విచక్షణారహితంగా కత్తితో దాడి చేసాడని స్థానికులు చెబుతున్నారు. ముందుగా భార్యపై కత్తితో దాడి చేసిన భర్త అడ్డువచ్చిన అత్త, మామను సైతం అల్లుడు కత్తితో దాడి చేసి గాయపరిచాడు. వెంటనే గాయపడ్డ వారిని స్థానికులు క్షతగాత్రులను ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. భార్య పల్లవి (22), మామ బాబు (55) పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న మట్టేవాడ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం నిందితుడు పరారీలో ఉన్నాడని సమాచారం.



### భక్తులకు అసౌకర్యం
## కలిగించొద్దు

**మహాశివరాత్రి ఏర్పాట్లను పరిశీలించిన సీ ఐ**

**పాలకుర్తి, మహా:** ఈనెల 26న జరిగే మహా శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీ సోమేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తులకుఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లను చేస్తున్నామని సీఐ మహేందర్ రెడ్డి అన్నారు.మహాశివరాత్రి ఉత్సవాలకు సంబంధించి గురువారం పాలకుర్తి మండలంలోని సోమేశ్వర స్వామి ఆలయాన్ని పాలకుర్తి ఎస్సై తో కలసి ఆలయ ఇ ఓ,సీఐ మహేందర్ రెడ్డిలు పరిశీలించారు.ఈ సందర్భంగా మహా శివరాత్రి సందర్భంగా స్నాన ఘట్టాలు, దర్శన మార్గాలు, తాగునీరు, పారిశుధ్యం, భోజన ఏర్పాట్లు, బందోబస్తు, విద్యుత్ సరఫరా, వైద్య శిబిరాలు ఏర్పాటు, సాధారణ ప్రజలు, విఐపిల ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, బారికేడ్ల ఏర్పాటు, యాత్రికుల రద్దీని నియంత్రించేందుకు క్యూలైన్లు,పార్కింగ్ స్థలాలను వంటి ఇతర ఏర్పాట్లను పర్యవేక్షించామని సీఐ తెలిపారు.

## అబ్దుల్లాపూర్ మెట్లో పర్యటించిన ఫ్లాగ్ షిప్ ప్రాజెక్టు కమిషనర్

- ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణ స్థల పరిశీలన
- పసుమాములల, మజీద్పూర్లను విజిట్ చేసిన శశాంక



**అబ్దుల్లాపూర్ మెట్, మహా:** రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్ మెట్ మండలంలో ఫ్లాగ్ షిప్ ప్రాజెక్టు కమిషనర్ శశాంక (ఐఏఎస్) అబ్దుల్లాపూర్ మెట్ మండలంలో పర్యటించారు. రాష్ట్ర ప్రభుత్వం కుల, మత బేదాలు లేకుండా అందరికీ ఒకే స్కూల్ చదువుకునే విధంగా.. ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను అందుబాటులోకి తీసుకురాబోతున్నామని గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన విషయం తెలిసింది. అందులో భాగంగా ఫ్లాగ్షిప్ ప్రాజెక్టు కమిషనర్ శశాంక పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ పరిధిలో పసుమాముల గ్రామ రెవెన్యూ సర్వే నెంబర్ 422 ఉన్న51 ఎకరాల ప్రభుత్వ స్థలానికి పరిశీలించారు. అదే విధంగా అబ్దుల్లాపూర్ మెట్ మండలం మజీద్పూర్ గ్రామ రెవెన్యూ సర్వే నెంబర్ 224లో దాదాపుగా 40 ఎకరాల ప్రభుత్వం స్థలం ఉంది. పసుమాముల, మజీద్పూర్ గ్రామాలలో నిర్మించబోయే ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణ స్థలాన్ని పరిశీలన చేశారు. ఈయన వెంట ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి, అబ్దుల్లాపూర్ మెట్ తహసీల్దార్ సుదర్శన్ రెడ్డి, సర్వేయర్ జ్యోతి, ఆర్ఐలు ఇంద్రాణి, నిజాముద్దీన్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

### మనస్తాపంతో యువకుడి
## ఆత్మహత్య



**వరంగల్, మహా:** ఏనుమాముల సాయి గణేష్ కాలనీ కి చెందిన కుసుమ దేవరాజ్, తండ్రి రాజశేఖర్, వయసు 24 సంవత్సరాలు, పని మానేసి ఇంటి వద్దనే ఉంటూ మద్యానికి బానిసై, జీవితం పై విరక్తి చెంది, తేదీ 2002 2025 అర్ధరాత్రి సుమారు 12:50 గంటలకు, అందరు నిద్రిస్తున్న సమయంలో బాత్రూమ్ లోని దూలానికి చీర తో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్టు ఏనుమాముల ఇన్స్పెక్టర్ ఏ రాఘవేందర్ తెలిపారు.

### ఉస్మానియాలో చికిత్స
## పొందుతూ వృద్ధ వ్యక్తి మృతి

**ఇబ్రహీంపట్నం, మహా:** ఉస్మానియా దవఖానలో చికిత్స పొందుతూ మృతి చెందిన వృద్ధుడు. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని, ఎలిమినేడు గ్రామంలో ఎక్కే శ్రీనివాస్ అనే రైతు తన వ్యవసాయ పొలంలో పనులు చేసుకుంటున్న సమయంలో ఈనెల 15వ తారీఖున ఓ గుర్తు తెలియని వృద్ధుడు అక్కడికి రాగా, అది గమనించిన శ్రీనివాస్ పరామర్శించగా వేరే భాషలో మాట్లాడగా, అతను తీవ్ర జ్వరంతో బాధపడుతున్నట్టు గమనించిన రైతు, అతనికి మందులు, ఆహార పదార్థాలు అందించాడు. దీంతో మరుసటి రోజు వ్యవసాయ పనుల మీద రైతు పొలానికి చేరుకోగా, అక్కడే ఉన్న వృద్ధుడు మరింత తీవ్ర జ్వరానికి లోను కావడంతో 108 అంబులెన్స్ కు ఫోన్ చేసి ఉస్మానియా దవఖానకు తరలించినట్లు తెలిపారు. దవఖానలో చికిత్స పొందుతూ ఈ నెల 17న వృద్ధుడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని పోలీసులు వెల్లడించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు అన్నారు. ఇట్టి వ్యక్తి ఆచూకీ తెలిసినచో ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ ఫోన్ నెంబర్ 871266 2419, 8712662361లను సంప్రదించాలని సిఐ జగదీష్ తెలిపారు.



## భారీగా గంజాయి పట్టివేత

- వైజాగ్ నయా హైదరాబాద్ టూ మహారాష్ట్ర తరలింపు
- మహేశ్వరం జోనల్ ఎస్వోటీ, అబ్దుల్లాపూర్మెట్ పోలీసులు జాయింట్ ఆపరేషన్ రూ.1.6 కోట్ల విలువ గంజాయి పట్టివేత
- స్కాప్ మెటీరియల్ మధ్యలో గంజాయి పెట్టి తరలింపు
- గంజాయి తరలిస్తున్న డీసీఎండ్రైవర్ అహ్మద్ షైక్ అరెస్టు రిమాండ్ తరలింపు
- మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన రాచకొండ సీపీ సుధీర్ బాబు



**ఎల్బీనగర్, మహా:** నగర శివారు ప్రాంతం అబ్దుల్లాపూర్ మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో రూ.1.5 కోట్ల విలువ చేసే గంజాయి పట్టుబడింది. వైజాగ్ వయ హైరాబాద్ టూ మహారాష్ట్రకు గంజాయి తరలిస్తున్నరన్నా విశ్వసనీయ సమాచారంతో మహేశ్వరం జోనల్ ఎస్ వోటీ పోలీసులు, అబ్దుల్లాపూర్ మెట్ పోలీసులు జాయింట్ ఆపరేషన్ గురువారం తెల్లవారుజామున రామోజీ ఫిలింసిటీ వద్ద తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో గంజాయి తరలిస్తుండా డీసీఎం పోలీసులు పట్టుబడిన ఘటన అబ్దుల్లాపూర్మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రాచకొండ కమీషనరేట్ ఎల్బీనగర్ క్యాంప్ ఆఫీసులు మీడియా సమావేశంలో ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో రాచకొండ సీపీ సుధీర్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. అహ్మద్ షైక్ అనే ఆడీసీఎం డ్రైవర్ అరకు నుంచి మహారాష్ట్ర గంజాయి సరఫరా చేస్తున్నారనే పక్కా సమాచారంతో నిఘా పెట్టామన్నారు. మహేశ్వరం జోనల్ ఎస్ వోటీ పోలీసులు, అబ్దుల్లాపూర్మెట్ పోలీసులు జాయింట్ సెర్చింగ్ డీసీఎం డ్రైవర్ పట్టుబడని తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.1.5కోట్లు ఉంటుందని తెలిపారు. ఈ గంజాయిని స్కాప్ మెటీరియల్ మధ్యలో పెట్టి ఎవ్వరికీ అనుమానం రాకుండా తరలిస్తుండాని వెల్లడించారు. ఆ డీసీఎం వాహనానికి ఒక్కడే డ్రైవర్ ఉంటాడు అతనే "అహ్మద్ షైక్. క్లీనర్ పెట్టుకుంటే సమాచారం లీక్ అవుతుందని ఉద్దేశంతో క్లీనర్ను పెట్టుకోకుండా జాగ్రత్త పడ్డాడు. గతంలో నిందితుడు అహ్మద్ షైక్పై రెండు కేసులు ఇదే తరహాలో నమోదు అయినట్లు వివరించారు. అహ్మద్ షైక్ వైభవ్, దేవా అనే "వ్యక్తులకు సప్లై చేస్తుంటాడని సీపీ సుధీర్ బాబు తెలిపారు. అహ్మద్ షైక్ ఒక ట్రిపుకు రూ.3 లక్షలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అహ్మద్ షైక్ చెడు వ్యసనాలు, విలసవంతమైన జీవితానికి అలవాటు పడి గంజాయి సప్లై చేసి సొమ్ము "చేసుకుంటున్నాడు. బుజ్జి బాబు అనే వ్యక్తి ద్వారా ఈ గంజాయి సప్లైపై సమాచారం వచ్చిందన్నారు. డ్రగ్స్, గంజాయి సరఫరాపై నిరంతరం నిఘా ఉంటుందని సీపీ సుధీర్ బాబు తెలిపారు. డీసీఎం డ్రైవర్ అహ్మద్ షైక్ అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. ఈ గంజాయి సప్లై వెనుక ఎవ్వరెవ్వరు ఉన్నారని లోతుగా దర్యాప్తు చేస్తున్నామని సీపీ సుధీర్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీపీ ప్రవీణ్ కుమార్, ఎస్వోటీ టీమ్, అబ్దుల్లాపూర్మెట్ ఇన్స్పెక్టర్ అంజిరెడ్డి తదితరులున్నారు.

## ప్రజా సమస్యలపై స్పందించిన కమిషనర్

- మహా పత్రిక ప్రతినిధి ఫోన్ కాల్ కు స్పందన..రోడ్డుపై మురుగు నీటిని తొలగించిన కమిషనర్







ప్రజా సమస్యలపై మహా ప్రతినిధి ఫోన్ కాల్ కు స్పందించిన కమిషనర్. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని నాగన్ పల్లి వెళ్లే రోడ్డులో గత కొన్ని నెలలుగా మరుగునీరు పారూతు వచ్చిపోయే వాహనదారులకు, ప్రజలకు ఇబ్బంది నెలకొంది, రోడ్డు పరిస్థితి అస్తవ్యస్తంగా ఉన్న కారణంగా రాకపోకలకు అంతరాయం ఏర్పడడంతో, ఇది గమనించిన మహా పత్రిక ప్రతినిధి, వెంటనే మున్సిపల్ కమిషనర్ కు ఫోన్ కాల్ చేయగా వెంటనే స్పందించి, తమ సిబ్బందిని సమస్య నెలకొన్న ప్రాంతానికి పంపించి సమస్యను పరిష్కరించారు. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పడు బెరీజ్ చేసుకుంటూ పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. మున్సిపాలిటీని అభివృద్ధి దిశగా తీసుకెళ్లే ప్రయత్నం చేయడం జరుగుతుందని, ప్రజా సమస్యల పరిష్కారానికి తాను ఎప్పుడు ముందుంటానని కమిషనర్ రవీందర్ సాగర్ అన్నారు.

# వస్తుండాయ్ ఫీలింగ్స్

## వాట్సాప్‌లో ఫీలింగ్స్‌పై తాజా ఫీచర్




వాట్సాప్ తన ఐఓఎస్ యాప్ కోసం కొత్త ఫీచర్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు వివిధ నివేదికలు వెల్లడిస్తున్నాయి. ముఖ్యంగా వాట్సాప్‌తో పాటు ఇన్‌స్టా గ్రామ్ మధ్య అంతరాన్ని తగ్గించడం లక్ష్యంగా నయా అప్‌డేట్స్‌ను నిపుణులు అందుబాటులోకి తీసుకొచ్చారు. వినియోగదారులు వారి వాట్సాప్ ఖాతాలలో వారి ఇన్ స్టా ప్రొఫైల్‌లను సక్రమంగా పంచుకోవడానికి కొత్త అప్ డేట్స్ వీలు కల్పిస్తుంది. ఈ ఫీచర్ ఐఓఎస్ యాప్‌నకు సంబధించిన తాజా బీటా వెర్షన్‌లో నిపుణులు గుర్తించారు? అయితే ఈ అప్‌డేట్ ప్రస్తుతం వాట్సాప్‌తో పాటు బీటా వెర్షన్‌తో నిపుణులు పరీక్షించలేదు. వాట్సాప్ బీటా తన నివేదికలో వినియోగదారులు తమ ఇన్‌స్టా ప్రొఫైల్ లింక్‌లను షేర్ చేసే ఫీచర్‌ను వాట్సాప్‌లో యాడ్ చేసిందేనే విషయం చాలా మందికి తెలియదు. ఈ సరికొత్త ఫీచర్ ద్వారా యూజర్లు వారి కాంటాక్ట్‌లు వారితో సులభంగా కనెక్ట్ అయ్యే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే ఐఓఎస్ బీటా యాప్ వెర్షన్ 25.2.10.72 కోసం వాట్సాప్‌లో ఈ అప్‌డేట్ కనిపించిందని నిపుణులు చెప్పడం విశేషం. ఈ ఫీచర్ ట్రాకర్ షేర్ చేసిన స్క్రీన్‌షాట్‌లతో పాటు యూజర్ ప్రొఫైల్ ఇంటర్‌ఫేస్‌లోని లింక్స్ విభాగానికి కొత్త ఆప్షన్ జోడించిందని నిపుణులు పేర్కొంటున్నారు. “యాడ్ లింక్స్” అని పిలిచే కొత్త ఆప్షన్‌తో వినియోగదారులు ప్లస్ ఐకాన్‌ను ఎంచుకోవడం ద్వారా వారి ఇన్‌స్టాగ్రామ్ యూజర్‌నేమ్‌లను జోడించే అవకాశం ఇప్పటికే అందుబాటులోకి వచ్చింది. ఈ ఫీచర్ ప్రస్తుతం వాట్సాప్ యూజర్లను వారు యాడ్ చేస్తున్న ప్రొఫైల్‌ను ప్రామాణీకరించమని అడగడం లేదని కూడా నివేదికలు వెల్లడిస్తున్నాయి. కాబట్టి ఇన్‌స్టాగ్రామ్‌తో ప్రత్యక్ష అనుసంధానం ద్వారా యూజర్‌నేమ్‌లను ధ్రువీకరించడం లేదా వాట్సాప్ యాప్‌లోని వారి ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలకు మాన్యువల్‌గా లాగిన్ అవ్వడం ద్వారా ఈ సమస్యలకు చెక్ పెడుతున్నట్లు నిపుణులు చెబుతున్నారు. ఈ ఫీచర్ ప్రస్తుతం ఇన్‌స్టా లింక్‌లకే పరిమితం అయినప్పటికీ ఫేస్ బుక్‌తో పాటు థ్రెడ్స్ వంటి ఇతర మెటా ఖాతాలకు విస్తరించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

## మూడు గంటల్లోనే చెన్నై టు కోల్‌కత్తా.. జలరవాణాలో నూతన టెక్నాలజీ



చెన్నై నుంచి కోల్‌కతాకు కేవలం మూడు గంటల్లో జిప్ ద్వారా ప్రయాణించవచ్చని ఐఐటీమద్రాస్ ఇంక్యుబేషన్ సెల్ మద్దతు ఉన్న ఓ స్టార్టప్ ప్రతినిధులు చెబుతున్నారు. ఏరో ఇండియా 2025 సందర్భంగా వాటర్‌ఫ్లై టెక్నాలజీస్ స్టార్టప్ ప్రతినిధులు ఈ కాన్సెప్ట్‌ను పరిచయం చేశారు. ఈ లక్ష్యాన్ని సాధించడానికి కంపెనీ వింగ్‌ఇన్‌గ్రౌండ్ క్రాఫ్ట్‌లైన ఎలక్ట్రిక్ సీగ్లైడర్‌ల ద్వారా అసాధ్యాన్ని సుసాధ్యం చేయవచ్చని చెబుతున్నారు. నీటి నుంచి టేకాఫ్ చేసి నాలుగు మీటర్ల ఎత్తులో ఎగరడానికి వీలు కల్పించే డిజైన్‌ను ద్వారా ఇది సాధ్యమనేనని పేర్కొంటున్నారు. కోల్‌కతా నుంచి చెన్నైకి డబ్ల్యూఐజీ క్రాఫ్ట్‌లో ప్రయాణించడానికి 1,600 కి.మీ ప్రయాణానికి సీటుకు కేవలం రూ. 600 మాత్రమే ఖర్చవుతుందని పేర్కొంటున్నారు. ముఖ్యంగా టిక్కెట్ ధర తక్కువ ఉండడంతో ఎక్కువ మంది ఇది ఎలా సాధ్యం అంటూ చర్చించుకోవడం విశేషం. డబ్ల్యూఐజీ క్రాఫ్ట్ ద్వారా విమానం కంటే 10 రెట్లు మెరుగైన ఇంధన సామర్థ్యంతో ప్రయాణాలు చేయవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. ఎయిర్‌బస్ ఏ320 లేదా బోయింగ్ 737లో చెన్నై నుంచి కోల్‌కతాకు వెళ్లే విమానం దాదాపు 2.5 నుండి 3 టన్నుల ఏవియేషన్ టర్బైన్ ఇంధనం అవసరం అవుతుంది. అయితే ఏవియేషన్ టర్బైన్ ఇంధనం ధర కొన్ని నగరాల్లో కిలోలీటర్‌కు రూ.95000 నుంచి మరికొన్ని నగరాల్లో రూ.98000 వరకు ఉంటుంది. ముఖ్యంగా డబ్ల్యూఐజీ క్రాఫ్ట్ ఫ్లాట్ డిజైన్ కారణంగా అత్యంత వేగంగా వెళ్లవచ్చు. అలాగే విమానాలు టేకాఫ్ అయిన తర్వాత అధిక ఎత్తుకు ఎగిరిన తర్వాత ప్రయాణిస్తుంది. అయితే డబ్ల్యూఐజీ క్రాఫ్ట్ టెక్నాలజీ ఎక్కువ ఎత్తు ఎగరాల్సిన అవసరం లేదు.


### సొంత కారు కలను నెరవేర్చేలా రెనాల్ట్ సూపర్ కార్లు..

## రూ.6.1 లక్షలకే రెండు కార్ల విడుదల

మన దేశ మార్కెట్ లో రెనాల్ట్ కంపెనీ కార్లకు మంచి ఆదరణ ఉంది. వీటిని కొనుగోలు చేయడానికి ప్రజలు ఇష్టపడతారు. కస్టమర్ల అవసరాలను అనుగుణంగా, ఆధునిక టెక్నాలజీ, ఫీచర్లతో ఈ కంపెనీ కార్లను విడుదల చేస్తుంది. దీంతో మార్కెట్ లో మంచి వాటాను కూడా సంపాదించింది. ఈ నేపథ్యంలో ప్రజాదరణ పొందిన పాత మోడళ్లను అప్ డేట్ చేసి, ఇప్పుడు విడుదల చేసింది. ఈ20 ప్రమాణాలకు అనుగుణంగా ఇంజిన్లలో మార్పులు చేశారు. వీటిలో ప్రామాణిక పవర్ విండోస్, సెంట్రల్ లాకింగ్ వంటి కొత్త ఫీచర్లు ఉన్నాయి. 8 అంగుళాల ఇన్ఫోటైన్మెంట్ సిస్టమ్, కొన్ని ట్రిమ్ లకు ఆండ్రాయిడ్ ఆటో / ఆపిల్ కార్ ప్లే అమర్చారు. ప్రస్తుతం ఈ రెండు మోడళ్లూ పవర్ ట్రెయిన్ ఎంపికలను నిలుపుకొంటూ, మెరుగైన ఫీచర్లతో వచ్చాయి. రెనాల్డ్ కిగర్ మోడల్ కారు ఆర్ఎక్స్ ఈ, ఆర్ఎక్స్ఎల్, ఆర్ఎక్స్టీ (ఓ), ఆర్ఎక్స్ జెడ్ అనే నాలుగు రకాల ట్రిమ్‌లలో అందుబాటులో ఉంది. అన్ని వేరియంట్లలో నాలుగు పవర్ విండోలు, రిమోట్ సెంట్రల్ లాకింగ్ ఏర్పాటు చేశారు. ఆర్ఎక్స్ ఎల్ వేరియంట్ లో 8 అంగుళాల టచ్ స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, వైర్డు ఆండ్రాయిడ్ ఆటో, ఆపిల్ ప్లే, రివర్స్ పార్కింగ్ కెమెరా, స్టీరింగ్ - మౌంటెడ్ కంట్రోల్ ఏర్పాటు చేశారు. వీటిలోని టాప్ ఎండ్ వేరియంట్ అయిన ఆర్ఎక్స్ ఎల్ ట్రిమ్ లో రిమోట్ ఇంజిన్ స్టార్ట్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. రోనాల్ట్ కిగర్ కారులో రెండు రకాల పెట్రోలు ఇంజిన్ల ఎంపికల్లో అందుబాటులోకి వచ్చింది. 1.0 లీటర్ పెట్రోల్ మోటార్ ఇంజిన్ నుంచి 72 హెచ్ పీ, 96 ఎన్ఎం టార్క్ విడుదల అవుతుంది.

అలాగే 1.0 లీటర్ టర్బో చార్జ్డ ఇంజిన్ నుంచి 100 హెచ్ పీ, 160 ఎన్ఎం గరిష్ట టార్క్ ఉత్పత్తి జరుగుతుంది. పాత ఇంజిన్ 5 స్పీడ్ మాన్యువల్, ఏఎంటీ తో లభిస్తుంది. టర్బో చార్జ్డ ఇంజిన్ లో 5 స్పీడ్ మాన్యువల్ లేదా సీవీటీ ఆప్షన్ ఏర్పాటు చేశారు. కొత్తగా రెనాల్డ్ ఆర్ఎక్స్టీ (0) ట్రిమ్ లో టర్బో సీవీటీ తో అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ మోడల్ రూ.9.99 లక్షలు (ఎక్స్ షోరూమ్) ధరకు లభిస్తోంది.



## ట్రంప్‌నకు గట్టి దెబ్బ.. కోడిగుడ్లు దొరక్క అమెరికన్ల అవస్థలు..!

అమెరికా ప్రస్తుతం తీవ్రమైన కోడి గుడ్ల సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. బర్డ్ ఫ్లూ వ్యాప్తి లక్షలాది కోళ్ల మరణానికి దారితీసింది. దీనివల్ల గుడ్ల ధరలు ఆకాశాన్ని అంటాయి. సూపర్ మార్కెట్లు గుడ్ల కొనుగోలుపై ఆంక్షలు విధిస్తున్నాయి. రెస్టారెంట్ యజమానులు తమ మెనూలలో మార్పులు చేయవలసి వస్తుంది. ఈ సంక్షోభం మధ్య, టర్కీ అమెరికాకు 15,000 టన్నుల గుడ్లు సరఫరా చేయాలని నిర్ణయించింది. ఈ ఎగుమతి ప్రక్రియ ప్రారంభమైంది. జూలై వరకు కొనసాగుతుందని టర్కియేస్ ఎగ్ ప్రొడ్యూసర్స్ సెంట్రల్ యూనియన్ చైర్మన్ తెలిపారు. ఈ మొత్తం సరఫరాను రెండు టర్కిష్ కంపెనీలు నిర్వహిస్తాయి. మొత్తం 700 కంటైనర్ల గుడ్లను అమెరికాకు పంపనున్నారు. 2022 నుండి అమెరికాలో బర్డ్ ఫ్లూ వ్యాప్తి కొనసాగుతోంది. ఇప్పటివరకు 162 మిలియన్లకు పైగా అంటే 16.2 కోట్ల కోళ్లు, టర్కీలు, ఇతర పక్షులు దీని బారిన పడ్డాయి. ఇటీవలి కేసుల్లో అకస్మాత్తుగా పెరుగుదల నమోదు చేసుకుంది. ఇది గుడ్ల కొరతను మరింత తీవ్రతరం చేసింది. ఈ వ్యాధిని నియంత్రించడానికి US వ్యవసాయ శాఖ (USDA) ఒక వ్యాక్సిన్‌ను తయారు చేసే పనిలో పడింది. గుడ్ల కొరతను తీర్చడానికి, అమెరికా తుర్కియే వంటి దేశాల నుండి గుడ్లను దిగుమతి చేసుకోవలసి వచ్చింది. ఈ ఒప్పందం ద్వారా టర్కీ దాదాపు 26 మిలియన్ డాలర్లు అంటే సుమారు రూ. 216 కోట్లు సంపాదిస్తుంది. ప్రపంచంలోని టాప్ 10 గుడ్లు ఎగుమతి చేసే దేశాలలో టర్కియే ఇప్పటికే ఉంది. ఇదిలావుంటే, బర్డ్ ఫ్లూ ప్రభావం ఇలాగే కొనసాగితే, అమెరికా మరిన్ని గుడ్లను దిగుమతి చేసుకోవాల్సి రావచ్చని నిపుణులు భావిస్తున్నారు. అయితే, అమెరికా వ్యవసాయ శాఖ ప్రస్తుతం ఈ అంశంపై వ్యాఖ్యానించడం మానేసింది. అయితే, టర్కీ నుండి వచ్చే గుడ్లు అమెరికాకు ఉపశమనం కలిగించవచ్చు, అయితే ఈ సంక్షోభం బర్డ్ ఫ్లూ వంటి ఇన్ఫెక్షన్లు మొత్తం ఆహార సరఫరాను ఎలా ప్రభావితం చేస్తాయో కూడా చూపిస్తుంది.



# దేశం-విదేశం

NATIONAL-INTERNATIONAL





## ఢిల్లీ సీఎం ప్రమాణస్వీకార వేడుకలో మోదీ, పవన్ మధ్య ఆసక్తికర సంభాషణ

ఢిల్లీ ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఓ ఆసకక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. ప్రధాని మోదీ, జనసేన అధినేత పవన్ కల్యాణ్ సరదా సంభాషణ. ఏపీ డిప్యూటీ సీఎం ఆహార్యం, వేషధారణ చూసిన మోదీ.. హిమాలయాలకు వెళ్తన్నారా పవన్..? అని ప్రశ్నించారు. దాంతో అక్కడే ఉన్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు సహా... ఎన్డీయే నేతలంతా విరగబడి నవ్విన దృశ్యాలు వైరల్ అవుతున్నాయి. ఢిల్లీ సీఎంగా రేఖా గుప్తా ప్రమాణ స్వీకారం చేశారు. రేఖా గుప్తాతో లెఫ్టినెంట్ గవర్నర్ సక్సేనా ప్రమాణం చేయించారు. ఢిల్లీకి నాలుగో మహిళా సీఎంగా.. ఓవరాల్‌గా 9వ సీఎంగా ప్రమాణస్వీకారం చేశారు. సీఎంతోపాటు.. ఆరుగురు మంత్రులుగా ప్రమాణం చేశారు. పర్వేశ్ సాహిబ్ సింగ్ వర్మ, మంజీందర్ సింగ్ సిర్సా, రవీందర్ ఇంద్రాజ్ సింగ్, కపిల్ మిశ్రా, ఆశిష్ సూద్, పంకజ్ సింగ్ కూడా మంత్రులుగా ప్రమాణం చేశారు. వీరితో లెఫ్టినెంట్ గవర్నర్ సక్సేనా ప్రమాణం చేయించారు. రామ్‌లీలా మైదానంలో ఢిల్లీ సీఎం ప్రమాణస్వీకారోత్సవం ఘనంగా జరిగింది.. ఈ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా సహా బీజేపీ, ఎన్డీఏ కూటమికి చెందిన ముఖ్యనేతలు హాజరయ్యారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తోపాటు.. ఎన్డీఏ పాలిత రాష్ట్రాల సీఎంలు, పలువురు డిప్యూటీ సీఎంలు హాజరయ్యారు. ఢిల్లీ అసెంబ్లీలో మొత్తం 70 స్థానాలుంటే ఏకంగా 48 చోట్ల BJP అభ్యర్థులు ఘన విజయం సాధించారు. 27 ఏళ్ల తర్వాత ఢిల్లీ గడ్డపై ఇంతటి ఘన విజయాన్ని అందించిన ఓటర్లకు ప్రధాని మోదీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పారు. అద్భుతమైన విజయం తర్వాత ఢిల్లీ CMగా ఎవరికి ఛాన్స్ ఇస్తారనే దానిపై చాలా చర్చలే జరిగాయి. ఫిబ్రవరి 8న ఫలితాలు వస్తే నిన్న రాత్రి వరకూ CM ఎవరనే సస్పెన్స్ కొనసాగింది. చివరికి తొలిసారి MLAగా గెలిచినా రేఖా గుప్తా వైపే BJP అధిష్టానం మొగ్గుచూపింది.

## ట్రైన్‌లోని జనరల్ భోగీలో

### అనుమానాస్పదంగా రెండు బ్యాగులు..



మాదకద్రవ్యాల మత్తులో పడి యువత చిత్తవుతోంది. తల్లిదండ్రుల కలల్ని నెరవేర్చాల్సిన పోయి.. వారు ఊహ లోకంలో పయనిస్తూ.. మైకంలో తేలిపోతున్నారు. అవును సామీ.! గంజాయి మత్తులో పడి.. యువత భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ గంజాయి మత్తును కూకటివేళ్లతో పెకిలించాలని డిసైడ్ అయ్యాయి. ఈ క్రమంలోనే పోలీసులకు ఫుల్ పవర్స్ కూడా ఇచ్చేశాయి. తాజాగా అరక్కోణం రైల్వేస్టేషన్‌లో సుమారు 11 ప్యాకెట్లలో 22 కేజీల ఎండు గంజాయిని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్) పోలీసులు పట్టుకున్నారు. చేసేందుకు ప్రయత్నించిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ రోజు బుధవారం, అరక్కోణం రైల్వే స్టేషన్‌కు అప్పుడే టాటానగర్(జార్ఖండ్) ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ వచ్చింది. ఆ ట్రైన్‌లో ఆర్‌పీఎఫ్ పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఇక వారికి జనరల్ కంపార్ట్‌మెంట్‌లో అనుమానాస్పదంగా రెండు టూరిస్ట్ బ్యాగులు కనిపించాయి. వాటిని చెక్ చేయగా దెబ్బకు బిత్తరపోయారు. అందులో 11 ప్యాకెట్ల గంజాయి కనిపించింది. అది సుమారు 22 కేజీలు ఉంటుందని అంచనా. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు.. ఆ గంజాయి ఎవరిది.? ఆ బ్యాగులు ఎవరివై ఉంటుంది.? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### ఇక ఏడాదికి 2 సార్లు

## 10, 12 తరగతుల పరీక్షలు



విద్యార్థులకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎద్యుకేషన్ (సీబీఎస్ఈ) గుడ్‌న్యూస్ చెప్పింది. ఇకపై ఏడాదికి రెండు సార్లు బోర్డు పరీక్షలు రాసేందుకు అవకాశం కల్పించనుంది. అన్నీ కుదిరితే 2026 నుంచే ఈ విధానం కార్యరూపం దాల్చనున్నట్లు తెలుస్తుంది. ఈ మేరకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అధ్యక్షతన స్కూల్ ఎద్యుకేషన్ కార్యదర్శి, సీబీఎస్ఈ, ఎన్సీఈఆర్టీ, కేంద్రీయ విద్యాలయ సంఘటన్ (కేవీఎస్), నవోదయ విద్యాలయ సమితి (ఎన్వీఎస్) ఉన్నతాధికారులతో మంగళవారం సమావేశం జరిగింది. దీనికి సంబంధించిన ముసాయిదాను ఏర్పాటుచేయగా.. వచ్చే సోమవారం నుంచి దీనిపై ప్రజాభిప్రాయాన్ని సేకరించనున్నట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇది అమలులోకి వస్తే విద్యార్థులకు పరీక్షల స్ట్రెస్ ఇక ఉండదనే చెప్పాలి. అంతేకాదు వారి స్కోర్ మరింత పెంచుకోవడానికి కూడా అవకాశం ఉంటుంది. అంతేకాకుండా 202627 విద్యా సంవత్సరం నుంచి గ్లోబల్ కరిక్యులమ్ కూడా అందుబాటులోకి తీసుకురావలని సీబీఎస్సీ బోర్డు యోచిస్తుంది. అంటే ప్రపంచవ్యాప్తంగా అన్ని సీబీఎస్సీ అనుబంధ స్కూళ్లలో ఒకే విధమైన సిలబస్ ఉంటుందన్నమాట. ఏడాదికి రెండుసార్లు నిర్వహించే బోర్డు పరీక్షల్లో.. విద్యార్థులు ఏ పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధిస్తే, వాటినే పరిగణనలోకి తీసుకొంటారు. ఏడాదికి రెండుసార్లు బోర్డు పరీక్షలు నిర్వహించినా.. విద్యార్థులు రెండుసార్లూ పరీక్షలకు హాజరవ్వడం తప్పనిసరికాదు. జేఈఈ మాదిరిగా 10, 12 తరగతుల విద్యార్థులు కూడా బోర్డు పరీక్షలకు రెండుసార్లు హాజరవ్వొచ్చు. ఇది పూర్తిగా విద్యార్థుల ఛాయిస్. అలాగే ఇలా ఏడాదికి రెండుసార్లు బోర్డు పరీక్షల నిర్వహించడం వల్ల విద్యార్థులపై ఒత్తిడి తగ్గుతుందని ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. సీబీఎస్ఈ పది, పన్నెండో తరగతి పరీక్షలను ప్రస్తుతం ఫిబ్రవరిమార్చి లో నిర్వహించి మేలో ఫలితాలు వెల్లడిస్తున్నారు. ఫెయిలైన విద్యార్థులకు జూలైలో సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నారు.ఈ పరీక్షల్లోనే ఏదైనా ఒక సబ్జెక్ట్‌లో తమ మార్కులను మెరుగుపర్చుకోవడానికి పాసైన విద్యార్థులకూ అవకాశం కల్పిస్తున్నారు. ఇప్పటి వరకు ఈ విధానం అమలులో ఉంది. అయితే తాజా విధానం అమల్లోకి వస్తే రెండు బోర్డు పరీక్షల మధ్య నిర్ణీత కాల వ్యవధి ఉంటుంది. అండర్ గ్రాద్యుయేషన్ (యూజీ) ప్రవేశాలపై దీని ప్రభావం ఏ మాత్రం పడకుండా నూతన విద్యా క్యాలెండర్‌ను రూపొందించే అవకాశం ఉంది. దీంతో విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధమవడానికి తగిన సమయం లభిస్తుంది. ఏడాదికి 2 సార్లు బోర్డు పరీక్షలు నిర్వహించే విధానం 2026 నుంచి అమలు చేసేందుకు కేంద్రం ముమ్మర ఏర్పాట్లు చేస్తుంది.

## ఆ ఇంట్లో రోజూ తెల్లవారుజామున వింత శబ్దాలు.. ఏంటని వెళ్లి చూడగా



ఉరుకుల పరుగుల జీవితంలో ఎక్కువ మంది ఎదుర్కొంటున్న సమస్యల్లో నిద్రలేమి ఒకటి. చాలా మంది ప్రశాంతమైన నిద్రకు దూరమవుతున్నారు. ఫలితంగా శారీరకంగా, మానసికంగా పలు అనారోగ్య సమస్యలతో పాటు ఒత్తిడి, పనిపై సరిగా దృష్టిపెట్టలేక పోవడం వంటి వివిధ ప్రాబ్లమ్స్‌ను ఎదుర్కొంటున్నారు. రాత్రిళ్లు ఛాటింగ్, వెబ్ సీరీస్ అంటూ కాలక్షేపం చేస్తూ నిద్రపోవడం లేదు. కానీ కేరళలో ఓ వృద్ధుడికి కోడిపుంజు వల్ల నిద్రపట్టడంలేదు. చివరకు అది రెండిళ్ల మధ్య వివాదానికి దారితీసింది. మరి ఆ వివాదం ఎలా పరిష్కారమైంది? కేరళలో రాధాకృష్ణ కురూప్ అనే వృద్ధుడికి కొత్త సమస్య వచ్చిపడింది. ఈ మధ్య కాలంలో ప్రశాంతమైన నిద్ర లేదు. తెల్లవారుజామున 3 గంటలైతే చాలు.. ఎంత గాఢనిద్రలో ఉన్నాగంట కొట్టినట్లు లేచి కూర్చొంటున్నారు. కారణం.. పొరుగింటి వారు పెంచుతున్న కోడిపుంజులు. కేరళలోని పథనంథిట్ట జిల్లా పల్లికల్ గ్రామవాసి అయిన రాధాకృష్ణ ఇంటి పక్కనే అనిల్‌కుమార్ నివసిస్తున్నారు. అనిల్ ఇంట్లో పెంచుకొంటున్న కోడిపుంజులు ప్రతిరోజు తెల్లవారుజాము 3 గంటలకు కొక్కొరోక్కో అంటూ కూతలు మొదలుపెడతాయి. ఈ వ్యవహారం రెండిళ్ల మధ్య వివాదానికి దారి తీసింది. ఇక లాభం లేదని అదూర్ ఆర్డీవో కార్యాలయంలో రాధాకృష్ణ ఫిర్యాదు చేశారు. అధికారుల బృందం ఆ రెండిళ్లను పరిశీలించింది. పై అంతస్తులో అనిల్ కోడిపుంజులను పెంచుతున్నారని, పొరుగింటికి ఇబ్బందికరంగా ఉన్న మాట వాస్తవమేనని వారు నివేదిక ఇచ్చారు. దీంతో అనిల్, రాధాకృష్ణలను పిలిచి చర్చించిన ఆర్డీవో పై అంతస్తులో ఉన్న పౌల్ట్రీ షెడ్డును ఇంటికి దక్షిణం దిక్కుకు మార్చాలని అనిల్‌ను ఆదేశించారు. ఇలా మార్చేందుకు అతడికి 14 రోజులు గడువిచ్చారు. ఈ వెరైటీ వివాదానికి ఇలా ఫుల్ స్టాప్ పెట్టారు.

మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | శుక్రవారం, హైదరాబాద్ | 21-02-2025
ANN తెలుగు

# రీతూనా మజాకా..


## కొండపల్లి బొమ్మలా చీరకట్టులో ఆకట్టుకున్న అందాల భామ



తెలుగమ్మాయి రీతూ వర్మ.. చైల్డ్ ఆర్టిస్ట్ గా కెరీర్ ప్రారంభించిన ఈ భామ ఇప్పుడు హీరోయిన్‌గా మారిన సినిమాలు చేస్తోంది. తెలుగుతో పాటు తమిళ్ లోనూ వరుసగా సినిమాలు చేస్తూ అభిమానులను సొంతం చేసుకుంటుంది ఈ చిన్నది. కెరీర్ బిగినింగ్ లో కొన్ని షార్ట్ ఫిలిమ్స్‌లో నటించింది ఈ భామ. ఆ తర్వాత సినిమాల్లోకి చైల్డ్ ఆర్టిస్ట్ గా వచ్చింది. ఎన్టీఆర్ హీరోగా నటించిన బాద్షా సినిమాలో చైల్డ్ ఆర్టిస్ట్ గా.. హీరోయిన్ చెల్లి పాత్రలో మెరిసింది. ఆ తర్వాత కొంత గ్యాప్ ఇచ్చింది. 2013లో శ్రీవిష్ణు నటించిన ప్రేమ ఇష్క్ కాదల్ అనే సినిమాలో హీరోయిన్ గా చేసింది. ఈ సినిమాలో రీతూ తన నటనతో ఆకట్టుకుంది. ఆతర్వాత నా రాకుమారుడు, ఎవడే సుబ్రహ్మణ్యం సినిమాల్లో హీరోయిన్ గా చేసి ఆకట్టుకుంది. ఇక 2016లో వచ్చిన పెళ్ళిచూపులు సినిమా ఈ బ్యూటీకి మంచి క్రేజ్ తెచ్చిపెట్టింది. ఈ సినిమా సూపర్ హిట్ అవ్వడంతో రీతూకి ఆఫర్స్ క్యూ కట్టాయి. నిన్నిలా నిన్నిలా, టక్ జగదీష్, ఒకే ఒక జీవితం, కణం, ఆకాశం, మార్క్ ఆంటోని సినిమాలు చేసింది. ఈ భామ నటనకు ప్రాధాన్యత ఉన్న సినిమాల ఎంచుకుంటూ రాణిస్తుంది. ఇటీవలే శ్రీవిష్ణు హీరోగా నటించిన స్వాగ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇక ఇప్పుడు సందీప్ కిషన్ తో కలిసి మజాకా అనే సినిమా చేస్తుంది. త్వరలోనే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.

# హంసకు సొగసును అప్ప ఇవ్వగలదు

## ఈ సుకుమారి.. మెస్మరైజ్ పాయల్



అజయ్ భూపతి దర్శకత్వంలో తెరకెక్కిన ఆర్ఎక్స్ 100 సినిమాతో హీరోయిన్ గా పరిచయం అయ్యింది పాయల్. రొమాంటిక్ ఎంటర్టైనర్ గా తెరకెక్కిన ఈ సినిమాలో పాయల్ తన నటనతో పాటు అందంతో కవ్వించింది. ఈ సినిమాలో రొమాంటిక్ సీన్స్ లో రెచ్చిపోయి నటించింది. తొలి సినిమాలోనే ఈ అమ్మడు ఆ రేంజ్ లో అందాలు ఆరబోయడం, రొమాంటిక్ సీన్స్ లో రెచ్చిపోవడంతో కుర్రకారు ఫిదా అయ్యారు. 5 డిసెంబర్ 1992న దేశ రాజధాని ఢిల్లీలో విమల్ కుమార్ రాజ్ పుత్, నిర్మల్ రాజ్ పుత్ దంపతులకు జన్మించింది పాయల్ రాజ్ పుత్. ఈ ముద్దుగుమ్మ యాక్టింగ్‌లో డిప్లొమా చేసింది. అలాగే ప్రముఖ కాలేజీలో గ్రాడ్యుయేట్ పట్టా పొందింది ఈ భామ. తన తల్లిదండ్రులతో కలిసి ముంబైలో నివసిస్తున్న ఈ బ్యూటీకి చిన్నతనం నుంచే నటన పై ఆశక్తితో గ్రాడ్యుయేషన్ తర్వాత చిత్రసీమలో అడుగుపెట్టింది. ముందుగా బుల్లితెరపై తన కెరీర్ మొదలుపెట్టింది ఈ వయ్యారి భామ. 2010లో సప్నోన్ సే భరే నైనా అనే ఓ హిందీ సీరియల్ లో సోనాక్షిగా టెలివిజన్ లో తన కెరీర్‌ని ప్రారంభించింది. ఆఖిర్ బహు భీ తో బేటీ హీ హై సీరియల్ లో సియా అనే ప్రధాన పాత్రను పోషించింది. గుస్తాఖ్ దిల్, మహాకుంభ్: ఏక్ రహస్యా, ఏక్ కహానీ సీరియల్స్ లో నటించింది.



# దేశంలోనే స్టారాది స్టార్లు.. ఈ హీరోలు నెలకు ఎంత కరెంట్ బిల్ చెల్లిస్తారో తెలుసా?

స్టార్ హీరోలు, హీరోయిన్ల వ్యక్తిగత జీవితాల గురించి తెలుసుకోవడానికి అభిమానులు ఎప్పుడూ ఆసక్తి చూపిస్తుంటారు. ఆ నటుడి ఆస్తి ఎంత? వాళ్ళ జీతం ఎంత? వాళ్ళ దగ్గర ఏ కార్లు ఉన్నాయి? ఇలాంటి ఎన్నో విషయాలు తెలుసుకోవడానికి అభిమానులు ఎక్కువ ఇంట్రెస్ట్ చూపిస్తుంటారు. మరి పెద్ద పెద్ద లగ్జీ ఇళ్లల్లో నివసించే బాలీవుడ్ సెలబ్రిటీల ఇళ్లకు విద్యుత్ బిల్లు ఎంత ఉంటుందో తెలుసుకోవాలనే ఆసక్తి కూడా చాలా మందికి ఉంటుంది. అలాంటి వారి కోసమే ఈ న్యూస్. బాలీవుడ్‌లోని చాలా మంది సెలబ్రిటీలకు ముంబైలో సొంత ఇళ్లు ఉన్నాయి. షారుఖ్ ఖాన్ నివాసం 'మన్నత్', అమితాబ్ బచ్చన్ విలాసవంతమైన బంగ్లాలతో ఇతర హీరోల నివాసాలు కూడా బాంద్రాలోనే ఉన్నాయి. ఇక సెలబ్రిటీలు తమ ఇళ్లు అందంగా కనిపించాలని కోరుకుంటారు. ఇందుకోసం తమ నివాసాను రంగు రంగుల లైట్లు, దీపాలతో అందంగా అలంకరిస్తారు. మరి అలాంటి సెలబ్రిటీల ఇళ్లకు పవర్‌బిల్ ఎంత ఉంటుందో తెలుసుకుందాం రండి. షారుఖ్ ఖాన్ కు ముంబైలో 'మన్నత్' అనే పేరు మీద ఇల్లు ఉంది. ఇది చాలా పెద్దది. ఈ ఇంట్లో చాలా గదులు ఉన్నాయి. ఈ ఇంటి కోసం షారుఖ్ ఖాన్ ప్రతి నెలా రూ.4345 లక్షల విద్యుత్ బిల్లు చెల్లిస్తున్నట్లు సమాచారం. సల్మాన్ ఖాన్ బాలీవుడ్ లో డిమాండ్ ఉన్న నటుడు. అతనికి ముంబైలో చాలా ఆస్తులు ఉన్నాయి. ప్రస్తుతం సల్లు గెలాక్సీ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్నాడు. అతను ప్రతి నెలా 2325 లక్షల రూపాయల విద్యుత్ బిల్లు చెల్లిస్తాడని సమాచారం. ఇక అమితాబ్ బచ్చన్ ఎన్నో ఏళ్ల నుంచి బాలీవుడ్‌లో సినిమాలు చేస్తున్నారు. ఆయనకు జుహులో సొంత బంగ్లా ఉంది. ఇందుకోసం బిగ్ బీ ప్రతి నెలా రూ.2225 లక్షల విద్యుత్ బిల్లు చెల్లిస్తారట. రణవీర్ సింగ్, దీపికా పదుకొనే వివాహం చేసుకుని చాలా సంవత్సరాలు అయింది. వారిద్దరూ సౌకర్యవంతమైన జీవితాన్ని గడుపుతున్నారు. ఈ జంట ముంబైలోని 4BHK అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్నారు. ఈ జంట 1315 లక్షల రూపాయల విద్యుత్ బిల్లు చెల్లిస్తున్నట్లు చెబుతున్నారు. సైఫ్ అలీ ఖాన్, కరీనా కపూర్ బాలీవుడ్‌లో స్టార్ కపుల్ గా కొనసాగుతున్నారు. ప్రస్తుతం వీరు ముంబైలోని సద్గురు శరణ్ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్నారు. వారు ప్రతి నెలా రూ.3032 లక్షల విద్యుత్ బిల్లు చెల్లిస్తారట. ఇక ఆమిర్ ఖాన్ కు ముంబైలో ఒక అపార్ట్ మెంట్ ఉంది. ఆయన దీని కోసం 911 లక్షల రూపాయల విద్యుత్ బిల్లు చెల్లిస్తున్నారని సమాచారం. విక్కీ కౌశల్, కత్రినా కైఫ్ వివాహం చేసుకున్నాక ముంబైలోనే కాపురముంటున్నారు. ఖరీదైన 4BHK అపార్ట్ మెంట్ లో వీరు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ జంట ప్రతి నెలా 810 లక్షల రూపాయల విద్యుత్ బిల్లు చెల్లిస్తారని చెబుతున్నారు.

# మహేష్, పవన్‌లాంటి స్టార్స్‌తో ఆడిపాడిన ఈ బ్యూటీ గుర్తుందా..?

## 51 ఏళ్ల వయసులోనూ సింగిల్‌గా ఉంటున్న హాటీ..

గత ఏడాది సినిమా ఇండస్ట్రీలో పెళ్లిబాజాలు గట్టిగానే మోగాయి. యంగ్ హీరోలు, హీరోయిన్ చాలా మంది పెళ్లి పీటలెక్కారు. కొంతమంది మాత్రం ఇంకా సింగిల్ గానే ఉంటున్నారు. నాలుగు పదుల వయసు దాటినా కూడా ఇప్పటికీ సింగిల్ గానే ఉంటున్నారు కొందరు భామలు. ఈ అమ్మడు మరీ రాడ్ సింగిల్ అనే చెప్పాలి ఏకంగా 51 ఏళ్ళు దాటినా కూడా ఇప్పటికే పెళ్లి మాట ఎత్తకుండా ఉంటుంది. మొన్నటివరకు ఓ యంగ్ హీరోతో యవ్వారం నడిపింది. ఇప్పుడు అతన్ని కూడా వదిలిపెట్టింది. ఇంతకూ ఆమె ఎవరో తెలుసా.? తెలుగులో మహేష్ బాబు, పవన్ కళ్యాణ్ లాంటి స్టార్ హీరోలతో ఆడిపాడింది ఆ అమ్మడు. ఇంతకూ ఆమె ఎవరో గుర్తుపట్టారా.? చాలా ఫేమస్ ఆమె.. మహేష్ బాబు, పవన్ కళ్యాణ్ లాంటి స్టార్ హీరోలతో స్టెప్పులేసిన ఆ బ్యూటీ ఎవరో కాదు బాలీవుడ్ హాట్ బ్యూటీ మలైకా అరోరా. ఈ బ్యూటీ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. బాలీవుడ్ లో చాలా ఫేమస్ ఈ చిన్నది. ముఖ్యంగా స్పెషల్ సాంగ్స్ కు పెట్టింది పేరు ఈ అమ్మడు. తెలుగులోనూ ఈ చిన్నది స్పెషల్ సాంగ్స్ చేసింది. మహేష్ బాబు హీరోగా నటించిన అతిథి సినిమాలో స్పెషల్ సాంగ్ చేసింది మలైకా.. అలాగే పవన్ కళ్యాణ్ నటించిన గబ్బర్ సింగ్ సినిమాలో నూ స్పెషల్ సాంగ్ చేసింది ఈ చిన్నది. బాలీవుడ్ లో ప్రస్తుతం ఈ చిన్నది పలు టీవీ షోల్లో కనిపించి ఆకట్టుకుంటుంది. ఇక ఈ బ్యూటీ సల్మాన్ ఖాన్ సోదరుడిని పెళ్లి చేసుకొని ఆతర్వాత అతనికి విడాకులు ఇచ్చింది. ఆతర్వాత యంగ్ హీరో అర్జున్ కపూర్ తో ప్రేమాయణం సాగించింది. తనకన్నా చాలా చిన్నవాడైన అర్జున్ తో చాలా కాలం ప్రేమాయణం నడిపింది. ఇటీవలే ఈ ఇద్దరూ బ్రేకప్ చెప్పకున్నారు.

# క్రీడా వార్తలు | SPORTS NEWS



# బంగ్లాదేశ్‌పై భారత్ ఘన విజయం

## సెంచరీతో అదరగొట్టిన శుభ్‌మన్ గిల్

చాంపియన్స్ ట్రోఫీలో టీమిండియా అదరగొట్టింది. దుబాయి వేదికగా బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. శుభ్‌మన్ గిల్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. బౌలింగ్, బ్యాటింగ్‌లో రాణించడంతో మినీ ప్రపంచకప్‌లో టీమిండియా గెలుపొందింది. 229 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియాకు ఓపెనర్లు శుభ్‌మన్ గిల్, రోహిత్ శర్మ శుభారంభం అందించారు. తొలి వికెట్‌కు ఇద్దరు 69 పరుగులు జోడించారు. వన్డేల్లో 11వేల పరుగులు చేసిన రోహిత్.. వరుస ఫోర్లతో బంగ్లా బౌలర్లపై విరుచుకుపడ్డాడు. వరుస ఫోర్లతో స్కోర్ బోర్డును పరుగులెత్తించిన రోహిత్ శర్మ భారీ షాట్‌కు యత్నించి పెవిలియన్‌కు చేరాడు. 36 బంతుల్లో ఏడు ఫోర్లు సహాయం 41 పరుగులు చేసిన రోహిత్.. తక్సిన్ బౌలింగ్‌లో రషిద్‌కు క్యాచ్ ఇచ్చి అవుట్ అయ్యాడు. ఆ తర్వాత బ్యాటింగ్‌కు వచ్చిన విరాట్ కోహ్లీ.. 38 బంతుల్లో 22 పరుగులు చేసిన విరాట్ రషిద్ బౌలింగ్‌లో పెవిలియన్‌కు చేరాడు. అనంతరం శ్రేయాస్ అయ్యర్ (15), అక్షర్ పటేల్ తక్కువ స్కోర్‌కే అవుట్ అయినా.. వికెట్ కీపర్, బ్యాట్స్‌మెన్ కేఎల్ రాహుల్‌తో కలిసి శుభ్‌మన్ గిల్ టీమిండియాను విజయం వైపు నడిపించారు. గిల్ 128 బంతుల్లో తొమ్మిది ఫోర్లు, రెండు భారీ సిక్సర్ల సహాయంతో 101 పరుగులు చేయగా.. కేఎల్ రాహుల్ 47 బంతుల్లో ఒక ఫోర్, రెండు సిక్సర్లతో నాటౌట్‌గా నిలిచారు. బంగ్లా బౌలర్లలో రషిద్‌కు రెండు, తక్సిన్ అహ్మద్, రెహమాన్‌కు చెరో వికెట్ దక్కింది. దుబాయి వేదికగా జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న బంగ్లాదేశ్ బ్యాటింగ్ ఎంచుకుంది. బంగ్లా జట్టును టీమిండియా బౌలర్లు ముప్పుతిప్పలు పెట్టారు. దాంతో ఓ సమయంలో బంగ్లా 35 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయింది. జాకిర్, హృదోయ్ భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పడంతో బంగ్లాదేశ్ ఆమాత్రం స్కోర్ సాధించగలిగింది. బంగ్లాదేశ్ 49.4 ఓవర్లలో 228 పరుగులు చేసింది. 118 బంతుల్లో ఆరు ఫోర్లు, రెండు సిక్సర్ల సహాయంతో హృదోయ్ సెంచరీ చేసి.. ఆ తర్వాత పెవిలియన్‌కు చేరాడు. హృదోయ్‌తో పాటు జకీర్ 68 పరుగులతో రాణించాడు. ఈ ఇద్దరు మినహా మరెవరూ రాణించలేకపోయారు. నలుగురు బ్యాట్స్‌మెన్ ఖాతా తెరువకుండానే పెవిలియన్‌కు చేరారు. మరో ముగ్గురు బ్యాటర్లు రెండంకెల స్కోరును చేయలేకపోయారు. తంజిద్ హసన్ 25 పరుగులు, రిషద్ హుస్సేన్ 18 పరుగులు మాత్రమే చేశారు. చాలాకాలం తర్వాత మళ్లీ జాతీయ జట్టులోకి చేరిన మహ్మద్ షమీ ఆకట్టుకున్నాడు. ఐదు వికెట్లు పడగొట్టి బంగ్లాదేశ్ వెన్నువిరిచాడు. వన్డేల్లో షమీ 200 వికెట్ల క్లబ్‌లో చేరాడు. హర్షిత్ రాణా మూడు వికెట్లు, స్పిన్నర్ అక్షర్ పటేల్‌కు రెండు వికెట్లు దక్కాయి.

# వన్డేల్లో హిట్‌మ్యాన్ 11 వేల రన్స్

## సచిన్, పాంటింగ్, గంగూలీని అధిగమించిన రోహిత్ శర్మ



ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా దుబాయి ఇంటర్నేషన్‌లో స్టేడియంలో బంగ్లాదేశ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ అరుదైన ఘనత సాధించాడు. వన్డేల్లో 11వేల పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. బంగ్లాదేశ్‌పై 12 పరుగులు చేసిన రోహిత్ శర్మ వన్డేల్లో వేగంగా 11వేల పరుగులు చేసిన రెండో ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. సచిన్, రికీ పాంటింగ్, సౌరభ్ గంగూలీ, జాక్వెస్ కలిస్ కంటే వేగంగా ఈ మైలురాయిని అందుకున్న క్రికెటర్‌గా నిలిచాడు. ఈ జాబితాలో టీమిండియా స్టార్ బ్యాట్స్‌మెన్ విరాట్ కోహ్లీ అగ్రస్థానంలో ఉన్నాడు. విరాట్ 222 వన్డేల్లో ఈ ఘనత సాధించడగా.. రోహిత్ శర్మ 261 వన్డేల్లో 11వేల పరుగులు పూర్తి చేశాడు.

ఇదిలా ఉండగా.. వన్డేల్లో వేగంగా 11వేల పరుగులు చేసిన ప్లేయర్లలో టాప్ ప్లేస్‌లో విరాట్ కోహ్లీ ఉన్నాడు. 222 ఇన్నింగ్స్‌లో విరాట్ 11వేల పరుగుల మైలురాయిని అందుకున్నాడు. టీమిండియా లెజెండరీ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ 276 ఇన్నింగ్స్, ఆస్ట్రేలియా ఆటగాడు రికీ పాంటింగ్ 286 వన్డేలు, టీమిండియా మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ 288 ఇన్నింగ్స్, దక్షిణాఫ్రికా దిగ్గజ ఆల్‌రౌండర్ జాక్ కాలిస్ 293 వన్డేల్లో ఈ ఘనత సాధించారు. ఇక ఇంటర్నేషనల్ క్రికెట్‌లో 11వేల పరుగులు చేసిన పదో ప్లేయర్‌గా నిలిచాడు. 18,426 పరుగులతో వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా సచిన్ పేరిట ఈ రికార్డు ఉన్నది. 14, 234 పరుగులతో కుమార సంగక్కర, 13,963 పరుగులతో విరాట్ కోహ్లీ స్థానాల్లో ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

# చరిత్ర సృష్టించిన మహమ్మద్ షమీ..

## భారత బౌలర్ ఖాతాలో 200వ వన్డే వికెట్



**దుబాయ్:** భారత పేస్ బౌలర్ మహమ్మద్ షమీ చరిత్ర సృష్టించాడు. చాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌లో బంగ్లా బ్యాటర్ జాకిర్ వికెట్ తీసి తన ఖాతాలో కొత్త రికార్డును వేసుకున్నాడు షమీ. వన్డేల్లో 200 వికెట్లు తీసిన స్పీడ్ బౌలర్ అయ్యాడు. అత్యంత వేగంగా వన్డేల్లో 200 వికెట్లు తీసిన బౌలర్‌గా షమీ నిలిచాడు. షమీ మొత్తం 5126 బంతులు వేసి తన ఖాతాలోకి 200వ వికెట్ వేసుకున్నాడు. అయితే ఆసీస్ బౌలర్ స్టార్క్ 200 వికెట్లు తీసుకోవడానికి 5240 బంతులు వేయాల్సి వచ్చింది. కానీ అతి తక్కువ మ్యాచుల్లో స్టార్క్ ఆ రికార్డును అందుకున్నాడు. టీ20 వరల్డ్‌కప్ తర్వాత గాయపడ్డ షమీ.. చాలా గ్యాప్ తర్వాత మళ్లీ జట్టులోకి వచ్చాడు. అత్యంత వేగంగా 200 వికెట్ల మైలురాయి చేరుకున్న ఇండియన్ బౌలర్‌గా షమీ నిలిచాడు. అతను 104 మ్యాచుల్లో ఆ రికార్డు క్రియేట్ చేశాడు. అంతకముందు మాజీ బౌలర్ అజిత్ అగార్కర్ 133 మ్యాచుల్లో ఆ రికార్డును అందుకున్నాడు. ఆసీస్ బౌలర్ మిచెల్ స్టార్క్ కేవలం 102 మ్యాచుల్లో 200 వికెట్ల మైలురాయి దాటాడు. దీనికి తోడు ఐసీసీ ఈవెంట్లలో ఇప్పటి వరకు షమీ తన ఖాతాలో 60 వికెట్లు వేసుకున్నాడు. వన్డే వరల్డ్‌కప్, చాంపియన్స్ ట్రోఫీల్లో అతను మొత్తం 60 వికెట్లు తీసుకున్నాడు. ఆ తర్వాత స్థానాల్లో జహీర్ ఖాన్(59), జవగల్ శ్రీనాథ్(47), జడేజా(43) ఉన్నారు.

**కోలుకున్న బంగ్లాదేశ్..**

జాకిర్ అలీ, తౌహిద్ హృదయ్.. బంగ్లాదేశ్ ఇన్నింగ్స్‌ను పునర్ నిర్మించారు. ఇండియాతో జరుగుతున్న మ్యాచ్‌లో.. ఓ దశలో బంగ్లాదేశ్ 35 రన్స్‌కే అయిదు వికెట్లు కోల్పోయింది. అయితే ఆ తర్వాత ఆరో వికెట్‌కు తౌహిద్, జాకిర్‌లు కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఆ ఇద్దరూ హాఫ్ సెంచరీలు నమోదు చేశారు. ఆరో వికెట్‌కు 153 రన్స్ జోడించారు. షమీ బౌలింగ్‌లో జాకిర్ అలీ భారీ షాట్‌కు ప్రయత్నించి కోహ్లీకి క్యాచ్ ఇచ్చాడు. జాకిర్ అలీ వ్యక్తిగతంగా 68 రన్స్ చేసి ఔటయ్యాడు. బంగ్లా 46 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 215 రన్స్ చేసింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com